thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 53 | జగిత్యాల | శుక్రవారం | 15 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

తిలక్ వర్మ మెరుపులు




11



## మూడో దశ 'సర్' అమలుకు
# ఈసీ గ్రీన్ సిగ్నల్

4 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(సర్) మూడవ దశను ప్రారంభించను న్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది.




## బీజేపీ పాలిత రాష్ట్రాలే
# లీక్ కేంద్రాలు
### పదేళ్లలో 93 పేపర్లు లీక్‌లు

- రెండు కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం
- నీట్ రాసిన విద్యార్థులకు అండగా ఉంటాం
- నీట్ రద్దు 'పెద్ద నోట్ల రద్దు' వంటిదే..
- మోడీ సర్కార్ వైఫల్యంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

నీట్-యూజీ 2026 రద్దు నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష, నియంతృత్వ నిర్ణయం వల్ల దేశంలోని కోట్లాది మంది యువత భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆయన విమర్శించారు. ప్రధాని మోడీ పదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా 93 పేపర్లు లీక్ అయ్యాయని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు.



**హైదరాబాద్, మే 14:** నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయ మని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడు తుందన్నారు. గత పదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడి లో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కార ణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2 లో



## 'నా భారతదేశం - నా కర్తవ్యం' షురూ

- పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం..
- వారానికి 2 రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్'
- వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'..

.. వివరాలు 4లో

## ఫస్టియర్ నుంచే
# ప్రాక్టికల్స్

ఇంటర్ విద్యలో విప్లవాత్మక మార్పులు

థియరీ మార్కులు తగ్గింపు..

ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు పెద్దపీట

2026-27 నుంచి కొత్త విధానం..

ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్‌లో ఊరట

2





## ప్రతిభకు పట్టాభిషేకం

బీసీ విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారాల' ప్రదానం

కొమురం భీమ్ భవన్‌లో ఘనంగా వేడుక..

హాజరైన మంత్రులు పొన్నం, వాకిటి

విద్యే బానిసత్వం నుంచి విముక్తి కలిగిస్తుంది..

రాజకీయాల్లో బీసీలు రాణించాలి: మంత్రి శ్రీహరి

2

## నేటి నుంచి 'సీపీగెట్' దరఖాస్తుల స్వీకరణ

పీజీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి



జూన్ 10 వరకు గడువు..

జులై తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు

తొలిసారి పరీక్ష నిర్వహిస్తున్న కాకతీయ వర్సిటీ..

ఆగస్టులో తరగతుల ప్రారంభం

2



## చక్కెర ఎగుమతులపై కేంద్రం నిషేధం

ధరల నియంత్రణే లక్ష్యం

.. వివరాలు 4లో

## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు
# బుట్టదాఖలు

కేంద్రంపై మంత్రి తుమ్మల ఆగ్రహం

పెరిగిన సాగు వ్యయాలకు అనుగుణంగా మద్దతు ధరలు లేవు..

భద్రాద్రిలో పామాయిల్ రైతుల ఆత్మీయ సత్కారం..

40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై తుమ్మల భావోద్వేగం

కేంద్ర ప్రభుత్వం రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను బుట్టదాఖలు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని భావోద్వేగానికి లోనయ్యారు.

2



## సింగరేణి గనుల్లో
# 'మహిళా శక్తి'

ఇక భారీ డంపర్ల స్టీరింగ్ పట్టనున్న అతివలు

తొలిసారిగా 13 మంది మహిళా ఆపరేటర్ల నియామకం

సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం ఆదేశాలతో కీలక నిర్ణయం

సింగరేణి బొగ్గు గనుల చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు కేవలం పురుషులకే పరిమితమైన భారీ డంపర్ల ఆపరేటింగ్‌లో ఇకపై మహిళలు కూడా తమ సత్తా చాటనున్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సింగరేణి యాజమాన్యం తొలిసారిగా మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. 60 నుండి 100 టన్నుల బరువు మోసే భారీ వాహనాలను నడిపేందుకు 13 మంది మహిళా ఉద్యోగులు సర్వసిద్ధమయ్యారు.

2





## 'గోల్డెన్ తీఫ్' గ్యాంగ్ అరెస్ట్

పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసును ఛేదించిన కరీంనగర్‌పోలీసులు

బీహార్‌కు చెందిన ముగ్గురు దొంగల గుర్తింపు..

రూ.82 లక్షల విలువైన బంగారం స్వాధీనం

.. వివరాలు 3లో



## మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ కేసు

కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

జూలై 31న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం..

2

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్

- నేడు హైకోర్టు కీలక నిర్ణయం
- ముందస్తు బెయిల్ విచారణ వారం వాయిదా.. మధ్యంతర రక్షణపై ఉత్కంఠ
- నిందితుడు సామాన్యుడే.. పదే పదే హోదా ప్రస్తావన వద్దన్న న్యాయస్థానం

3



చురకలు






## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

### కేంద్రంపై మంత్రి తుమ్మల ఆగ్రహం

**పెరిగిన సాగు వ్యయాలకు అనుగుణంగా మద్దతు ధరలు లేవు..**

### కేంద్రం రైతులను మోసం చేస్తోంది

**భద్రాద్రిలో పామాయిల్ రైతుల ఆత్మీయ సత్కారం..**

### 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై తుమ్మల భావోద్వేగం

**భద్రాద్రి కొత్తగూడెం, మే 14:** కేంద్ర ప్రభుత్వం రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను బుట్టదాఖలు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. సాగు వ్యయం భారీగా పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెంచకపోవడం వల్ల రైతులు దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిగా 40 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో పది ఉమ్మడి జిల్లాల పామాయిల్ రైతులు గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, కేంద్రం సహకరించకపోయినా రైతుల ప్రయోజనాల కోసం మొక్కజొన్న, జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. ఈ కొనుగోళ్ల వల్ల తెలంగాణ ప్రభుత్వంపై రూ.4 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. వరి మద్దతు ధరను కేంద్రం కేవలం 72 శాతం మాత్రమే పెంచిందని, మొక్కజొన్నపై 10 శాతం పెంపు ఏమాత్రం సరిపోదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దతు ధరలను కనీసం 30 నుంచి 40 శాతం వరకు పెంచాలని, ప్రతి పంటలో 75 శాతం దిగుబడిని కేంద్రమే సేకరించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, కోతుల బెడద, చీడపీడల నుంచి తప్పించుకోవాలంటే రైతులు పామాయిల్ సాగు వైపు మళ్లాలని మంత్రి సూచించారు. దివంగత సీఎం ఎన్టీఆర్ హయాంలో అశ్వారావుపేటలో ప్రారంభమైన పామాయిల్ సాగు, నేడు లక్షలాది మంది రైతుల తలరాతను మారుస్తోందని కొనియాడారు. మన దేశం ఏటా లక్ష కోట్ల రూపాయల పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటోందని, దిగుమతి సుంకాన్ని పెంచితే స్వదేశీ రైతులకు మరింత మెరుగైన ధర లభిస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో తెలంగాణకు పామాయిల్ సాగు ఒక వరంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**చివరి శ్వాస వరకు ప్రజా సేవలోనే..**

తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తుమ్మల భావోద్వేగానికి లోనయ్యారు. పదవులు ముఖ్యం కాదని, ముందు తరాలకు మేలు చేసే పనులు చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది కాలంలోనే రైతాంగం కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని గుర్తుచేశారు. తన ప్రస్థానంలో సహకరించిన ముఖ్యమంత్రులు, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ, చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానని మంత్రి ఉద్ఘాటించారు.

## మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ కేసు

### కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

**జూలై 31న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం**

**హైదరాబాద్, మే 14:** తెలంగాణలో గత కొద్దికాలంగా సంచలనం రేపుతున్న ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో జరిగిన అక్రమాలపై ఏసీబీ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని (ఛార్జ్‌షీట్) ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ఈ కేసులో ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుండి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే బదిలీ చేసినట్లు ఏసీబీ తన దర్యాప్తులో ప్రాథమికంగా గుర్తించింది. ఈ నిధుల మళ్లింపులో ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని, ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ చెల్లింపులు జరిపించారని ఏసీబీ తన అభియోగపత్రంలో పేర్కొంది.

**ఏ1గా కేటీఆర్.. ఏ2గా ఐఏఎస్ అధికారి**

ఈ కేసులో ఏసీబీ మొత్తం ఐదుగురిని నిందితులుగా పేర్కొంది. ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్ ఉండగా, ఏ2గా మున్సిపల్ శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావును చేర్చింది. అలాగే ఏ5 నిందితుడిగా ఎఫ్ఈఓ సంస్థను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో ఏసీబీ అధికారులు కేటీఆర్ సహా ఇతర నిందితులను పలుమార్లు ప్రశ్నించి వాంగ్మూలాలను సేకరించారు. తాజాగా కోర్టు సమన్లు జారీ చేసిన నేపథ్యంలో, జూలై 31న జరిగే విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# బీజేపీ పాలిత రాష్ట్రాలే లీక్‌ల కేంద్రాలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, మే 14: నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్



అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## ప్రతిభకు పట్టాభిషేకం

**బీసీ విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారాల' ప్రదానం**

**బంజారాహిల్స్‌లో ఘనంగా వేడుక..**

**హాజరైన మంత్రులు పొన్నం, వాకిటి**

**విద్యే బానిసత్వం నుంచి విముక్తి కలిగిస్తుంది..**

**రాజకీయాల్లో బీసీలు రాణించాలి: మంత్రి శ్రీహరి**



**హైదరాబాద్, మే 14:** బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ప్రతిభా పురస్కారాల' ప్రదానోత్సవానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. విద్య మనిషికి వినయాన్ని ప్రసాదిస్తుందని, ఆ వినయమే వ్యక్తిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని పేర్కొన్నారు. "విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకువస్తుందని నెల్సన్ మండేలా, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు చాటిచెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సరస్వతీ దేవికి రంగు, రూపు తేడాలు ఉండవని, చదువుపై చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి వివరించారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఒత్తిడి లేకుండా 25 వేల మందికి బదిలీలు, ప్రమోషన్లు కల్పించామని గుర్తుచేశారు. అలాగే, వందేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కులగణనను ప్రజా ప్రభుత్వం చేపట్టిందని, అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలన్నదే ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై దేశ భవిష్యత్తును మార్చే చట్టాలు చేయాలని మంత్రి శ్రీహరి ఆకాంక్షించారు. రాజకీయాలపై ఉన్న పాత ధోరణులను విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్

**ఇంటర్ విద్యలో విప్లవాత్మక మార్పులు**

**థియరీ మార్కులు తగ్గింపు..**

**ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు పెద్దపీట**

**2026-27 నుంచి కొత్త విధానం..**

**ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్‌లో ఊరట**



**హైదరాబాద్, మే 14:** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి రాష్ట్రంలోని ఇంటర్ విద్యా విధానంలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో ప్రయోగాత్మక అవగాహనను పెంచే లక్ష్యంతో 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త పరీక్షా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు గురువారం కీలక వివరాలను వెల్లడించారు. ఇప్పటివరకు కేవలం సెకండియర్‌లో మాత్రమే 30 మార్కులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను ఇకపై రెండు సంవత్సరాలకు విభజించారు. సైన్స్ సబ్జెక్టులైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీల్లో ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. దీనివల్ల థియరీ పరీక్షలు 60 మార్కులకే పరిమితం కానున్నాయి. గణితంలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు 75 మార్కులకు ఉన్న థియరీ పరీక్షను 60 మార్కులకు తగ్గించారు. మిగిలిన 15 మార్కులను 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' కింద ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించారు. ముఖ్యంగా ఎంఈసీ విద్యార్థులకు శుభవార్త చెబుతూ, ఇకపై వారికి ఎంపీసీ విద్యార్థులతో సంబంధం లేకుండా ప్రత్యేకమైన గణితం ప్రశ్నపత్రాన్ని రూపొందించాలని బోర్డు నిర్ణయించింది. తెలుగు, ఇంగ్లీష్ వంటి భాషా సబ్జెక్టులతో పాటు కామర్స్, ఎకనామిక్స్ వంటి హ్యూమానిటీస్ గ్రూపుల్లో కూడా ఇంటర్నల్ మార్కులను ప్రవేశపెట్టారు. 100 మార్కుల థియరీ పరీక్షను 80 మార్కులకు తగ్గించి, మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించారు. దీనివల్ల విద్యార్థులపై వార్షిక పరీక్షల ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులతో 'ఏసీఈ' అనే కొత్త గ్రూపును బోర్డు పరిచయం చేస్తోంది. అలాగే, ఫస్టియర్ విద్యార్థుల కోసం సరికొత్త పాఠ్యపుస్తకాలను సిద్ధం చేశారు. నిపుణుల కమిటీ రూపొందించిన ఈ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌లు, ఇన్ఫో గ్రాఫిక్స్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ వంటి ఆధునిక అంశాలను పొందుపరిచారు. ఈ పుస్తకాలను జూన్ 1 లోపు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు బోర్డు స్పష్టం చేసింది.

# సింగరేణి గనుల్లో 'మహిళా శక్తి'

**ఇక భారీ డంపర్ల స్టీరింగ్ పట్టనున్న అతివలు**

- తొలిసారిగా 13 మంది మహిళా ఆపరేటర్ల నియామకం
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం ఆదేశాలతో కీలక నిర్ణయం




**హైదరాబాద్, మే 14:** సింగరేణి బొగ్గు గనుల చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు కేవలం పురుషులకే పరిమితమైన భారీ డంపర్ల ఆపరేటింగ్‌లో ఇకపై మహిళలు కూడా తమ సత్తా చాటనున్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సింగరేణి యాజమాన్యం తొలిసారిగా మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. 60 నుండి 100 టన్నుల బరువు మోసే భారీ వాహనాలను నడిపేందుకు 13 మంది మహిళా ఉద్యోగులు సర్వసిద్ధమయ్యారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ రవాణా చేసే భారీ డంపర్లను నడపడం శారీరక దృఢత్వంతో పాటు ఎంతో నైపుణ్యంతో కూడుకున్న పని. ఎండ, వాన, చలి వంటి వాతావరణ పరిస్థితులను తట్టుకుని మూడు షిఫ్టుల్లో పని చేయాల్సి ఉంటుంది. 50ఏళ్లుగా ఈ పనులను పురుషులు మాత్రమే నిర్వహిస్తూ వచ్చారు. అయితే, మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించడంతో యాజమాన్యం ఈ విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ విధులకు ఆసక్తి చూపిన సుమారు 35 మంది మహిళా ఉద్యోగుల్లో, అర్హులైన వారికి సిరిసిల్లలోని 'తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్' ద్వారా భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కంపెనీయే స్వయంగా ఖర్చు భరించి ఈ శిక్షణను పూర్తి చేయించింది. శిక్షణ పొందిన 13 మంది మహిళా ఉద్యోగులు తాము క్షేత్రస్థాయిలో బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. వీరందరికీ త్వరలోనే డంపర్ ఆపరేటర్లుగా నియామక పత్రాలు అందనున్నాయి.

**అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా..**

"మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్న ఈ రోజుల్లో, గనుల్లో డంపర్లు నడపడం అసాధ్యమేమీ కాదు" అని శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా ఆపరేటర్లు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, ఇప్పటికే బెల్లంపల్లి ఖైరిగూడ గనిలో అత్యంత క్లిష్టమైన 'బ్లాస్టింగ్' విభాగంలో మహిళలు రాణిస్తున్నారని అధికారులు వెల్లడించారు. అలాగే, సంస్థ చరిత్రలో తొలిసారిగా 'మహిళా రెస్క్యూ జట్టు'ను కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఇకపై అన్ని క్లిష్టతరమైన బాధ్యతల్లో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పిస్తామని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.




# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్

## నేడు హైకోర్టు కీలక నిర్ణయం

**ముందస్తు బెయిల్ విచారణ వారం వాయిదా.. మధ్యంతర రక్షణపై ఉత్కంఠ**

**నిందితుడు సామాన్యుడే.. పదే పదే హోదా ప్రస్తావన వద్దన్న న్యాయస్థానం**

**హైదరాబాద్, మే 14:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో న్యాయస్థానం విచారణ కీలక దశకు చేరుకుంది. భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయి-ల్ పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజుల పాటు వాయిదా వేసింది. అయితే, ఈ లోపు పోలీసులు అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణ (ఇన్టెరిమ్ ప్రొటెక్షన్) కల్పించాలన్న విజ్ఞప్తిపై న్యాయస్థానం శుక్రవారం (మే 15) తన నిర్ణయాన్ని వెల్లడించనుంది. గురువారం జరిగిన విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపిస్తూ.. నిందితుడు ఒక కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, బాధితురాలిపై కరీంనగర్‌లో తప్పుడు కేసులు కూడా పెట్టించారని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ప్రతిసారీ నిందితుడి హోదాను పదే పదే ప్రస్తావించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. చట్టం ముందు అందరూ సామాన్యులేనని గుర్తు చేసింది.

### పోక్సో చట్టం వర్తించదు - రక్షణ కావాలి

భగీరథ్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. బాధితురాలు మైనర్ కాదని, గతంలో ఆమెపై నమోదైన ఒక కేసు రికార్డుల ప్రకారం ప్రస్తుతం ఆమె వయస్సు 19 నుంచి 20 ఏళ్ల మధ్య ఉంటుందని, కాబట్టి పోక్సో చట్టం వర్తించదని వాదించారు. రాజకీయ కారణాలతోనే ఈ కేసులో అక్రమంగా పోక్సో సెక్షన్లు చేర్చారని ఆరోపించారు. ముందస్తు బెయిల్ పిటిషన్ వారం వాయిదా పడినందున, ఈ వారం రోజుల్లో అరెస్టు జరగకుండా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

### నేడే తుది నిర్ణయం

బాధితురాలి వాదనలు కూడా వినాలని ఆమె తరఫు న్యాయవాది కోరడంతో, హైకోర్టు మధ్యంతర బెయిల్ అంశాన్ని శుక్రవారానికి వాయిదా వేసింది. ఇప్పటికే పేట్ బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌కు నోటీసులు జారీ చేయగా, ఆయన వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో నేడు హైకోర్టు ఇచ్చే తీర్పు భగీరథ్ భవిష్యత్తును నిర్ణయించ నుంది. ఒకవేళ మధ్యంతర రక్షణ లభించకపోతే పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# హైదరాబాద్‌లో మరోమారు భారీగా డ్రగ్స్ పట్టివేత

**డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి పట్టివేత**



**హైదరాబాద్, మే 14:** నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సూరారం– కొంపల్లి హైటెన్షన్ రోడ్‌లో డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇన్నోవా కారులో డ్రగ్స్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కారు ఆపిన అధికారులు.. తనిఖీలు చేపట్టగా డ్రగ్స్ బయటపడింది. నిందితులు నుంచి మూడు గ్రాములు ఎండీఎంఏ, 36 గ్రాముల ఓజీ కుష్, 7 గ్రాముల చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.2.58 లక్షలు ఉంటుందని అంచనా. బడా బాబుల పిల్లలే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకాలు జరిపి.. నిందితులు భారీగా సొమ్ము చేసుకుంటు న్నట్లు ఎస్టీఎఫ్‌బీ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌తో పాటు కారును సీజ్ చేశారు. డ్రగ్స్‌ను ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎప్పటి నుంచి ఈ దందా నడిపిస్తున్నారనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల వెనక పెద్ద ముఠా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# చెన్నై ఎక్స్‌పెస్‌లో సాంకేతిక లోపం

**నల్లగొండ, మే 14:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు పాటు నిలిచిపోయింది. ఇంజిన్‌లో విద్యుత్ సమస్య తలెత్తడంతో రైలు ఆగిపోయింది. మరమ్మతుల అనంతరం రైలు 9:50 గంటలకు బయలుదేరి వెళ్లింది. ట్రైయిన్ ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండాకాలం కావడంతో ట్రైన్‌లో ఫ్యాన్లు, ఎసిలు పనిచేయకపోవడంతో నానాయాతన పడ్డారు.

# రైస్ మిల్లులో మంత్రుల మెరుపు తనిఖీ

- బీహార్ హమాలీలతో ముచ్చట
- ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియపై ఆరా..
- మిల్లర్లు సహకరించాలని విజ్ఞప్తి
- సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచన



**నల్గొండ, మే 14:** నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బాలాజీ రైస్ మిల్లును మంత్రుల బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కలిసి మిల్లులో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు రైస్ మిల్లు యజమానులతో పాటు అక్కడ పనిచేస్తున్న హమాలీలతో ముఖాముఖి మాట్లాడి వివరాలు సేకరించారు. మిల్లులో పనిచేస్తున్న హమాలీలను మంత్రులు పలకరిస్తూ ఎక్కడి నుండి వచ్చారని ఆరా తీశారు. తాము బీహార్ నుండి వచ్చామని, ప్రతిరోజూ 10 నుండి 15 లారీలను అన్‌లోడ్ చేస్తున్నామని వారు మంత్రులకు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ధాన్యం రాక ఎక్కువగా ఉన్నందున, హమాలీలు ఇంకా కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని మంత్రులు కోరారు. పని చేసే చోట ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ తమ వద్దకు వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసుకుంటే నిల్వ సమస్యలు తలెత్తవని మంత్రులు అభిప్రాయపడ్డారు. మిల్లుల్లో అన్‌లోడింగ్ వేగంగా జరిగితేనే కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం లారీలను వెంటనే మిల్లులకు పంపేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు ఈ విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం అయ్యేలా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

# చేప ప్రసాదం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి



- జూన్ 8న నాంపల్లి గ్రౌండ్స్‌లో పంపిణీ.
- అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

**హైదరాబాద్, మే 14:** మృగశిర కార్తి పురస్కరించుకుని జూన్ 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఆయన ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు 24 గంటల పాటు నిరంతరాయంగా జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుండి లక్షలాది మంది ఆస్తమా బాధితులు వచ్చే అవకాశం ఉన్నందున, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే భక్తులకు క్యూ లైన్లలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు మరియు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని షెడ్లను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ మళ్లింపు మరియు పార్కింగ్ విషయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే చోట పిక్‌పాకెటింగ్, చైన్ స్నాచింగ్ వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అదనపు ఆర్టీసీ బస్సులను నడపాలని, మత్స్య శాఖ అధికారులు నాణ్యమైన చేప పిల్లలను తగినంత సంఖ్యలో సిద్ధం చేయాలని సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, 1847లో ప్రారంభమైన చేప ప్రసాదం పంపిణీ 179 ఏళ్లుగా ప్రజల విశ్వాసంతో విజయవంతంగా కొనసాగుతోందని గుర్తుచేశారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, ఇది అన్ని వర్గాల ప్రజలు నమ్మకంతో పాల్గొనే కార్యక్రమమని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బత్తిని కుటుంబ సభ్యులు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ భేటీ

**పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు**

**ఐటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సహకారంపై ఆసక్తి**

**భవిష్యత్ భాగస్వామ్యంపై ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆశాభావం**

**హైదరాబాద్, మే 14:** భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ గురువారం నందినగర్‌లోని నివాసంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ కూడా పాల్గొన్నారు. పరస్పర ప్రయోజనాలు మరియు వ్యూహాత్మక అంశాలపై ఈ ఉన్నత స్థాయి సమావేశంలో నేతలు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, మరియు విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. గతంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేసిన కేటీఆర్, హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా మరియు ఇన్నోవేషన్ రంగాల గురించి వివరించారు. తెలంగాణ మరియు ఆస్ట్రేలియా మధ్య పటిష్టమైన సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆస్ట్రేలియా ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు మరియు సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో తెలంగాణలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఏర్పడిందని, అది ఆస్ట్రేలియా కంపెనీలకు గొప్ప అవకాశంగా మారుతుందని



ఈ సందర్భంగా నేతల మధ్య చర్చకు వచ్చింది.

# 'గోల్డెన్ తీఫ్' సుబోధ్ గ్యాంగ్ అరెస్ట్


- పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసును ఛేదించిన కరీంనగర్‌పోలీసులు
- బీహార్‌కు చెందిన ముగ్గురి గుర్తింపు
- రూ.82 లక్షల బంగారం స్వాధీనం
- రెండు నెలల ముందే రెక్కీ..
- నకిలీ గుర్తింపు కార్డులతో తిరుగుతున్న ముఠా: సీపీ గౌస్ ఆలం




**కరీంనగర్, మే 14:** నగరంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో సినీ ఫక్కీలో కాల్పులు జరిపి, భారీ దోపిడీకి పాల్పడిన కేసును కరీంనగర్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ దారుణానికి ఒడిగట్టింది దేశవ్యాప్తంగా 'గోల్డెన్ తీఫ్'గా పేరుగాంచిన బీహార్‌కు చెందిన సుబోధ్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సీపీ, ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరీగాసింగ్‌తో పాటు ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. దోపిడీకి రెండు నెలల ముందే ఈ ముఠా తెలంగాణకు వచ్చి ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లోని ప్రముఖ బంగారు దుకాణాలపై రెక్కీ నిర్వహించినట్లు సీపీ తెలిపారు. దోపిడీ సమయంలో ఐదుగురు దొంగలు పిస్టల్స్‌తో లోపలికి ప్రవేశించి, అడ్డువచ్చిన సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీ, సిబ్బంది కమల్, మధుకర్ మరియు సెక్యూరిటీ గార్డు రాజేశ్‌పై కాల్పులు జరిపారు. కేవలం ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్న దొంగలు, సుమారు 161.4 తులాల (దాదాపు కిలోన్నర) బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దీని విలువ సుమారు రూ. 82 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. దోపిడీ అనంతరం పల్సర్, అపాచీ బైక్‌లపై పరారైన నిందితులు, రైలు, బస్సుల ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు 12 రోజుల పాటు సుదీర్ఘ ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకున్నారు. నిందితులు దొరక్కుండా ఉండేందుకు నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నెంబర్లు, ఫేక్ పేర్లతో తిరుగుతుంటారని సీపీ వివరించారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద వీరు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. బీహార్, బెంగాల్, జార్ఖండ్ వంటి పలు రాష్ట్రాల్లో ఈ ముఠాపై అనేక కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీ కార్యాలయం, జడ్జి నివాసాలకు సమీపంలోనే ఈ దోపిడీ జరగడంతో ప్రజల్లో వ్యక్తమైన ఆందోళనలను పోలీసులు తాజా అరెస్టులతో పటాపంచలు చేశారు.

చురకలు





## సంపాదకీయం

# కాన్వాయ్‌ల కార్లు తగ్గితే పొదుపు కాదు!

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ మోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖార్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు వియారన టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్త బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయి-ంలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్థనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్థనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిదుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కోనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్ధరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, ఖరైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్లర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

# 'నా భారతదేశం - నా కర్తవ్యం' షురూ

- పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం..
- వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్'
- వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'..
- మంత్రులకు 'మండే మెట్రో' తప్పనిసరి
- ముఖ్యమంత్రి రేఖాగుప్తా కీలక నిర్ణయాలు..



**న్యూఢిల్లీ, మే 14:** దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా నేతృత్వంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నూతన విధానం రేపటి నుంచే అమల్లోకి రానుంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా ముఖ్యమంత్రి తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేయడమే కాకుండా, అందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే వినియోగించాలని నిర్ణయించి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. పౌరుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు 'నా భారతదేశం – నా కర్తవ్యం' పేరుతో 90 రోజుల పాటు సాగే ప్రత్యేక ఉద్యమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక నిబంధనను తీసుకువచ్చారు. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికల్ డే' పాటించి సైకిళ్లు, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను ఎంచుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అలాగే, వచ్చే ఆరు నెలల వరకు ప్రభుత్వ శాఖలేవీ కొత్తగా పెట్రోల్, డీజిల్ లేదా ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయకూడదని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని అధికారిక విదేశీ పర్యటనలను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మినహా ఎవరికీ విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. మ-రోవైపు, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో తీవ్రంగా ఉన్న వాయు కాలుష్య సమస్యను అదుపు చేసేందుకు ఈ వర్క్ ఫ్రమ్ హోమ్, మెట్రో వినియోగం వంటి చర్యలు ఎంతగానో తోడ్పడతాయని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## మహా సీఎం వినూత్న ప్రయోగం

**రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై విధానసభకు ఫడ్నవీస్ • కాన్వాయ్‌కి స్వస్తి పలికి బైక్‌పై పయనం..**

**ప్రధాని మోదీ పిలుపుతో కీలక నిర్ణయం**

**ముంబై, మే 14:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపునకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వినూత్నంగా స్పందించారు. ఇంధన పొదుపు దిశగా ఒక అడుగు ముందుకేసి, తన అధికారిక కార్ల కాన్వాయ్‌ని పక్కన పెట్టి ద్విచక్ర వాహనంపై ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. గురువారం మహారాష్ట్ర శాసన మండలికి కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు ఆయన తన నివాసం నుండి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విధాన భవన్‌కు బయలుదేరారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఆశిష్ షెలార్ మరియు భద్రతా సిబ్బంది కూడా ద్విచక్ర వాహనాలపైనే అనుసరించడం విశేషం. ఈ సందర్భంగా తాను బైక్‌పై వెళ్తున్న ఫోటోలు, వీడియోలను ముఖ్యమంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశం కోసం ఇది తన వంతు సహకారమని, ప్రతి ఒక్కరూ దేశ ప్రయోజనాల దృష్ట్యా తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని స్వయంగా తన కాన్వాయ్‌ను 15 వాహనాల నుండి కేవలం రెండు వాహనాలకు తగ్గించుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని బాటలోనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా పలువురు నేతలు ఇప్పటికే తమ కాన్వాయ్‌లను తగ్గించుకోగా, ఫడ్నవీస్ ఏకంగా బైక్ ప్రయాణాన్ని ఎంచుకుని తన నిబద్ధతను చాటుకున్నారు. మరోవైపు, దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇంధన పొదుపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు మెట్రో స్టేషన్ల మీదుగా నడిచే షటిల్ బస్సులను వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించగా, సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత వాహనాలకు బదులు మెట్రో, బస్సుల్లో ప్రయాణించాలని అధికారులు కోరుతున్నారు. ఇలా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కఠినమైన పొదుపు చర్యలను అమలు చేస్తున్నాయి.

## మూడో దశ 'సర్' అమలుకు
# ఈసీ గ్రీన్ సిగ్నల్

**16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ**

**జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు • కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన**

**న్యూఢిల్లీ, మే 14:** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా-నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

## మద్యం పాలసీ కేసు విచారణ నుంచి తప్పుకున్న
# హైకోర్టు న్యాయమూర్తి

**ఆప్ నేతలకు కోర్టు ధిక్కార నోటీసులు..**

**న్యూఢిల్లీ, మే 14:** ఢిల్లీ మద్యం పాలసీ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించిన అనంతరం, ఈ కేసు విచారణ నుంచి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకున్నారు. ఈ కేసును ఇకపై వేరే ధర్మాసనం విచారిస్తుందని ఆమె స్పష్టం చేశారు. న్యాయమూర్తులను, కోర్టు విచారణలను కించపరిచేలా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణించింది. న్యాయపరమైన అంశాలను కోర్టులో ఎదుర్కోవాల్సింది పోయి, వాటిని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి న్యాయవ్యవస్థపై వ్యతిరేకతను పెంచేలా ప్రచారం చేస్తున్నారని కోర్టు మండిపడింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించినందుకు సమాధానం ఇవ్వాలంటూ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, నేతలు వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. రాజకీయ పోరాటాలు ప్రజాక్షేత్రంలో జరగాలని, కానీ న్యాయస్థానాల తీర్పులను, న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని కోర్టు హెచ్చరించింది. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే రాజకీయ ప్రకంపనలు కొనసాగుతుండగా, హైకోర్టు తీసుకున్న ఈ తాజా నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.


## చక్కెర ఎగుమతులపై
# కేంద్రం నిషేధం

**ధరల నియంత్రణే లక్ష్యం**

**వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు ఆంక్షలు..**

**తక్షణమే అమల్లోకి ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ, మే 14:** దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారతదేశం నుంచి చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. ఈ నిషేధం వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. చక్కెర నిల్వలు తగ్గడం, దేశీయ మార్కెట్‌లో ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో కేంద్రం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం ముడి చక్కెర, తెల్ల చక్కెర, శుద్ధి చేసిన చక్కెర సహా అన్ని రకాల చక్కెర ఎగుమతులపై నిషేధం అమలులోకి రానుంది. గతంలో నియంత్రిత విభాగంలో ఉన్న ఎగుమతులను ఇప్పుడు పూర్తిగా నిషేధిత విభాగంలోకి మార్చినట్లు విదేశీ వాణిజ్య నియంత్రణ సంస్థ వెల్లడించింది. ముందస్తు అనుమతులు లేదా లైసెన్సులు ఉన్నా కూడా ఇకపై సాధారణ ఎగుమతులకు అవకాశం ఉండదు. అయితే, యూరోపియన్ దేశాలు, అమెరికాతో ఉన్న ప్రత్యేక కోటా ఒప్పందాల ప్రకారం ఇప్పటికే కుదిరిన పరిమిత ఎగుమతులకు మాత్రం ఈ నిషేధం నుండి మినహాయింపునిచ్చారు. ప్రపంచంలోనే చక్కెర ఉత్పత్తిలో భారత్ రెండో అతిపెద్ద దేశంగా ఉండటంతో, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో చక్కెర ధరలు పెరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. దేశీయంగా వినియోగదారులకు ఈ నిర్ణయం ఊరటనిచ్చినప్పటికీ, విదేశీ ఆర్డర్లపై ఆధారపడిన చక్కెర కర్మాగారాలు మరియు ఎగుమతి వ్యాపారులపై దీని ప్రభావం పడవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయినప్పటికీ, దేశీయ అవసరాలకే తమ మొదటి ప్రాధాన్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



చురకలు

శుక్రవారం 15 మే 2026

## పంట మార్పిడితో సుస్థిర ఆదాయం



**సత్తుపల్లి:** పంట మార్పిడి ద్వారా రైతులు సుస్థిర ఆదాయం పొందవచ్చని ఉద్యాన విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్ ఐవి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాన్ని వేంసూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించారు. వ్యవసాయ కళాశాల ఆశ్వరావుపేట అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో గిరాకీ ఉన్న పంటలను సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చని సూచించారు. ఆయిల్ పామ్, ఇతర ఉద్యాన పంటల సాగుపై రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అనంతరం స్రవంతి సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు నీటి కాలుష్యం కూడా తగ్గుతుందని తెలిపారు. అధిక రసాయన ఎరువుల వినియోగం వాతావరణ మార్పులకు కారణమవుతుందని పేర్కొన్నారు. అలాగే విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన ఆరు ముఖ్య అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి పి.రామమోహన్ మాట్లాడుతూ రైతులు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు, లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, పీఏసీఎస్ అధ్యక్షుడు టి.గోపాలకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు స్వాతి, సందీప్, షేక్ రీమా, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభకు ఘన సత్కారం

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు



**సత్తుపల్లి:** వేంసూరు మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చడంతో గ్రామ సర్పంచ్ ఆంద్రయ్య ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు మార్చిలో నిర్వహించిన వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించారు. వీరిలో బి.మన్విత 600 మార్కులకు గాను 553 మార్కులు సాధించి వేంసూరు మండలంలో ద్వితీయ స్థానం పొందగా, పి.రుష్మిత 551 మార్కులతో మండల తృతీయ స్థానం కైవసం చేసుకుంది. అలాగే బి.యశస్విని 524 మార్కులు, కర్రి కీర్తన 514 మార్కులు, కర్రి మౌనిక 512 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి నారాయణ రెడ్డి–సుశీలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రతిభ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంలో అందిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పాఠశాల ఉపాధ్యాయులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, తిరుపతిరావు, ఫకీర్, ఆనంద్ కుమార్, కరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైతులను ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**సత్తుపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆగం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వరి, మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. కొనుగోళ్లు ప్రారంభమైన 45 రోజుల తర్వాత మంత్రులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కోతలకు ముందే సమీక్షలు నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గింజ కొనుగోలు చేశారని గుర్తు చేశారు. కరోనా సమయంలో కూడా రైతులను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లు ఆలస్యం చేయడంతో రైతులు ప్రైవేట్ మిల్లర్లను ఆశ్రయించి ఆంధ్ర ప్రదేశ్లోని మండపేట, పెద్దాపురం ప్రాంతాలకు పచ్చి వడ్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు క్వింటాకు రూ.800 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలు, బస్తాలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా, రైతు బీమా అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే బస్తాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. సత్తుపల్లి డివిజన్లో భారీగా ధాన్యం ఉన్నప్పటికీ కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని, ప్రైవేట్ మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాకర్లపల్లి గ్రామ రైతులు, సత్తుపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**




**ఆసిఫాబాద్:** జిల్లాలో వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధ జలాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కెరమెరి మండలంలోని ధనోరా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌస్‌లను సందర్శించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పంప్ హౌస్ నుండి ఎన్ని మండలాలకు నీటి సరఫరా జరుగుతోంది, గ్రామాలకు నీరు ఏ విధంగా అందుతోంది అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, పంపింగ్ వ్యవస్థను పరిశీలించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు కలగకూడదని, పైపులైన్లలో లీకేజీలు ఉన్నా లేదా మోటార్లలో సమస్యలు ఉన్నా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. నీటి సరఫరాను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం కెరమెరి మండలంలోని కొఠారి కోలం గూడ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.ఎన్. ప్రకాష్ రావుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామానికి మంజూరైన 110 ఇండ్లలో ఇప్పటికే 108 ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని, వాటిలో 7 ఇండ్లు పూర్తి కాగా, 86 ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. లబ్ధిదారులు తమ ఇండ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతిరోజూ లబ్ధిదారులతో సంప్రదింపులు జరుపుతూ, నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు వరం 'బెస్ట్ అవైలబుల్ స్కీమ్'

**జిల్లా కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్ :** గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తామని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను 3, 5, 8 తరగతుల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద లక్కీ డ్రా ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని, ఇది గిరిజన విద్యార్థులకు ఒక వరమని పేర్కొన్నారు. మొత్తం 56 సీట్లకు గాను కేటాయింపులు జరిగాయని, ఇందులో పి.వి.టి.జి విద్యార్థులకు 5 సీట్లు, ఏజెన్సీ విద్యార్థులకు 5 సీట్లు కేటాయించగా, మిగిలిన 46 సీట్లను పారదర్శకంగా లక్కీ డ్రా ద్వారా భర్తీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఈ ఎంపికలో 3వ తరగతికి 29 మంది, 5వ తరగతికి 14 మంది, మరియు 8వ తరగతికి 13 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ కె. హరిత**

**ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ముపరాజ్ మార్మాట్, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లను నియమించి వారికి తక్షణమే శిక్షణ ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి బీఎల్ఏ ల జాబితా తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోపు ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని, బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరిస్తారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.




# డాక్టరేట్ గ్రహీత అశోక్ కు సన్మానం



**ఆసిఫాబాద్ :** లూసియానా అమెరికన్ రీసెర్చ్ యూనివర్సిటీ (పూణే) ద్వారా ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు డాక్టర్ అశోక్ మహోల్కర్‌ను జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. అట్రాసిటీ కమిటీ, గిరిజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గత నెల 19న డాక్టరేట్ అందుకున్న అశోక్‌ను ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు మాదిగ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివితేనే సమాజం గౌరవిస్తుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తు చేశారు. బుద్ధిజంతో పాటు సామాజిక సేవా రంగంలో అశోక్ చేసిన కృషికి గుర్తింపుగా లూసియానా అమెరికన్ రీసెర్చ్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ లభించడం జిల్లాకే గర్వకారణమని ఆయన అభినందించారు. విద్య, సేవా దృక్పథం ఉన్న వ్యక్తులకు ఇటువంటి గౌరవాలు దక్కడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఇగరపు గణేష్, కొబ్రగడే గంగుబాయి, గిరిజన సంఘం జిల్లా నాయకులు పర్చాకి కేశవరావు, పూజారి ఆత్రం పాండు పటేల్ , గిరిజన సంఘం నాయకులు ఆత్రం వినోద్ కుమార్, సింగు, మహేష్, మనీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వట్టివాగులో ఘనంగా 'బడి బాట'



**ఆసిఫాబాద్ రూరల్:** మండలంలోని వట్టివాగు గ్రామంలో గురువారం 'ఆచార్య జయశంకర్ బడి బాట' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఆత్రం ఈశ్వరి దీనకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్.సి.ఆర్.పి రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, సన్నబియ్యం భోజనం వంటి వసతులు ఉన్నాయని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం కుమరం మాధవరావ్, ఎస్.సి.ఆర్.పి అనంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో రూ. 1.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ. 1.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక కొట్నాక భీం రావు చిల్డ్రన్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ. అహ్మద్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి స్థానిక కౌన్సిలర్లతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ. 1.20 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్, స్మశాన వాటిక, షాదీ ఖానా పనులతో పాటు చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులు అందుబాటులోకి వస్తే పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ. అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, వినోద్, దూడల లక్ష్మి , రాపర్తి కార్తీక్, స్వప్న, సాలం బిన్ అహ్మద్‌లతో పాటు నాయకులు అబ్దుల్ ఫయాజ్, సయ్యద్ ఆన్సర్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, సయ్యద్ నిసార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# అటవీ సంపదకు 'టేకు' పెట్టిన దుండగులు

- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు..!
- ఎక్స్ రోడ్డు అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా కలప స్మగ్లింగ్
- బీట్ అధికారి బుకాయింపు.. నిఘా లోపమా..? కుమ్మక్కా..?





**నేరడిగొండ:** ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా ఉండాల్సిన అటవీ ప్రాంతం ఇప్పుడు అక్రమార్కుల పాలిట కామధేనువుగా మారింది. ఎక్స్ రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజులుగా అటవీ సంపద కొల్లపోతోంది. విలువైన టేకు చెట్లను దుండగులు యథేచ్ఛగా నరికేస్తున్నా, అటవీ శాఖాధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**క్షేత్రస్థాయిలో భీభత్సం..**

మండలంలోని ఎక్స్ రోడ్డు అటవీ ప్రాంతంలో పర్యటిస్తే అక్రమ నరికివేతకు గురైన టేకు చెట్ల ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అక్కడక్కడా నరికివేసిన మొద్దులు, చెల్లాచెదురుగా పడి ఉన్న టేకు దుంగలే ఇందుకు సాక్ష్యం. రాత్రికి రాత్రే భారీ వృక్షాలను నేలకూల్చి, రవాణాకు వీలుగా ముక్కలు చేసి తరలిస్తున్నట్లు అర్థమవుతోంది. పచ్చని అడవిని బోడిగుండులా మారుస్తున్న దుండగుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

**అధికారి సమాధానం.. విడ్డూరం!**

ఈ విషయమై సంబంధిత బీట్ అధికారిని వివరణ కోరగా, ఆయన అత్యంత నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. "అక్కడ చెట్ల నరికివేత జరగలేదు.. అలాంటిదేమీ మా దృష్టికి రాలేదు" అంటూ పచ్చి అబద్ధాలతో బుకాయించే ప్రయత్నం చేశారు. క్షేత్రస్థాయిలో కళ్ళముందే సాక్ష్యాలు కనిపిస్తున్నా, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి 'ఏమీ జరగలేదు' అని చెప్పడం వెనుక అసలు అంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**అనుమానాల వెల్లువ..**

బీటు స్థాయి అధికారుల సహకారం లేనిదే ఇంత భారీ స్థాయిలో చెట్ల నరికివేత సాధ్యమని స్థానికులు చర్చించుకుంటున్నారు. మామూళ్ల మత్తులో అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం గస్తీ నిర్వహించాల్సిన సిబ్బంది ఏం చేస్తున్నారు..? లక్షల రూపాయల విలువైన టేకు సంపద అక్రమార్కుల పరమవుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు..? దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పేర్కొంటున్నారు.

**బీట్ అధికారిపై సమగ్ర విచారణ జరిపించాలి..**

కలప స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన, వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేసిన బీట్ అధికారిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అటవీ శాఖాధికారి స్పందించి ఎక్స్ రోడ్డు అటవీ ప్రాంతాన్ని సందర్శించి, వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు మండల వాసులు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం నమోదే లక్ష్యం

**సత్తుపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం నమోదే లక్ష్యంగా ముందుకు సాగాలని సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత వేణు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమాన్ని ఈనెల 14 నుంచి జూన్ 19 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం సత్తుపల్లి పట్టణంలోని 3వ వార్డు అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రతి చిన్నారికి విద్యాహక్కు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. బడిఈడు పిల్లలందరినీ గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. అంగన్వాడీ పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లోకి, ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లోకి చేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. డ్రాపౌట్స్, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పూర్వ విద్యార్థులను స్కూల్ బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకోవాలని కోరారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు చదువు మానేయకుండా అల్పాహారం, మధ్యాహ్న భోజనం, యూనిఫాం వంటి పథకాలను ప్రభుత్వం మరింత విస్తరిస్తోందని అన్నారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎమ్మెల్యే, అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఉచిత విద్య, పోషకాహారం, హాస్టల్ వసతులు, మెరుగైన సదుపాయాలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కృషి

**కాగజ్నగర్:** విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ శ్రీదేవి అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పూర్వ విద్యార్థులు, పేరెంట్స్–స్టూడెంట్స్ కమిటీ, కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న కళాశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. అలాగే డిగ్రీ పూర్తయ్యిన అనంతరం వివిధ రంగాల్లో సాధించిన విజయాలను వివరించి, ప్రస్తుత విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అనంతరం పేరెంట్స్–స్టూడెంట్స్ కమిటీ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధి, కళాశాలలో ఉన్న సౌకర్యాలపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం జరిగిన కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో అహ్మద్ అలీ, దేవానంద్ పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ నరసింహం మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారం, కృషి వల్లనే కళాశాల ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. కళాశాల కోఆర్డినేటర్ శ్రీ దుర్గం జనార్దన్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అందరూ కలిసి కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తూదూరు దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ చొరవతో విద్యా సంస్థల మధ్య ఒప్పందం

**ఆదిలాబాద్:** జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడమే కాకుండా, విద్యార్థులను వృత్తిపరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా కీలక అడుగు వేశారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, రిమ్స్ నర్సింగ్ కళాశాల మధ్య విద్యా ఒప్పందం కుదిరేలా చేసి, జిల్లాలోని బిఎస్ సి హెల్త్కేర్ మేనేజ్మెంట్, విద్యార్థులకు మెరుగైన శిక్షణా మార్గాలను సుగమం చేశారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత కలెక్టర్ ను కలిసి ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించడం కోసమే ఈ విద్యా సహకారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్ నర్సింగ్ కళాశాలలోని అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో శిక్షణ పొందడంతో విద్యార్థులకు వైద్య రంగంపై పూర్తిస్థాయి పట్టు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, సైన్స్ కళాశాల విద్యార్థులు రిమ్స్ నర్సింగ్ కళాశాలలోని అత్యాధునిక వనరులను, నిపుణులైన ఫ్యాకల్టీ సేవలను వినియోగించుకోవచ్చని, దీంతో విద్యార్థుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెరగడమే కాకుండా, భవిష్యత్తులో హెల్త్కేర్ రంగంలో వారు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.



# జొన్న రైతులు ఆందోళన చెందవద్దు

**ఆదిలాబాద్:** జొన్నల కొనుగోళ్ల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం నేపథ్యంలో గురువారం ఆయన ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జొన్నలు, మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియతో పాటు గోదాముల్లో నిల్వల విధానాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అకాల వర్షం కారణంగా మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన జొన్నలకు పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి రైతు పండించిన జొన్నలను వంద శాతం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ధాన్యం కొనుగోళ్ల వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్తో కలిసి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులు తమ పంటను మార్కెట్కు తీసుకువచ్చే ముందు సంబంధిత ఏఈఓ వద్ద టోకెన్ తీసుకోవాలని సూచించారు. టోకెన్లో పేర్కొన్న తేదీ ప్రకారమే మార్కెట్ యార్డుకు రావాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం కజ్జర్ల గ్రామంలోని రామాలయం ఫంక్షన్ హాల్లో శుక్రవారం నుంచి కొత్త కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రైతులు షెడ్యూల్ ప్రకారం మార్కెట్ యార్డుకు జొన్నలను తీసుకువచ్చి అధికారులకు సహకరించాలని కోరారు.



# నేరడిగొండ పబ్లిక్ స్కూల్లో విద్యా వారోత్సవాలు

**తల్లిదండ్రుల సమావేశం, అవగాహన ర్యాలీ**



**నేరడిగొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యా వారోత్సవాలు–బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశానికి స్థానిక సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్థానిక పాఠశాల తెలంగాణ పబ్లిక్ స్కూల్గా ఎంపిక కావడం ఆనందకరమని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత, నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తున్నదని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విద్యార్థులను 6వ తరగతిలో కొత్తగా చేర్పించుకున్నారు. పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఎస్.నేహా, పి.హేమలత, పి.సాహితి, సిద్ధార్థ్లను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపీసీ చైర్మన్ గంగామణి, ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యురాలు సాబ్లే కవితా సంతోష్ సింగ్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యతో ఉన్నత అవకాశాలు

**నేరడిగొండ:** ప్రభుత్వ విద్యతో అన్నత అవకాశాలు లభిస్తాయని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ షబానా తరన్నం అన్నారు. 'ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత చదువుల విషయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి, నైపుణ్యం ఉంటే ఆ దిశగానే వారిని ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఇదే కళాశాలలో చదివి ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తిని నింపారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ సంతోష్ కుమార్ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం కళాశాల బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర అధ్యాపకుడు ఉపేందర్ రెడ్డి, అధ్యాపకులు మమత, ప్రవీణ్, గ్రామ పెద్దలు పూజ, నీలబాయి, రాములు తదితరులు పాల్గొన్నారు.



# నేడు జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నేరడిగొండ:** మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు సెంటర్ ఇంచార్జ్ గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# తాండూర్ లో బడిబాట ర్యాలీ



**తాండూర్:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం తాండూర్ లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలచే బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సదుపాయాలను, విద్యా ప్రమాణాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షులు పెద్దబోయిన శంకర్, మాజీ సర్పంచ్ సాల్వాజి ఉమారాణి, యువ నాయకులు పప్పీ, రవీందర్, శివ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బోరు బావికి మోటర్ ఏర్పాటు



**తాండూర్:** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేదరివాడ, శివాలయం వీధి, మక్కా వాడా ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది. గత కొంత కాలంగా ఈ ప్రాంతంలో నీటి సరఫరా సరిగా లేక స్థానికులు పలుమార్లు తాండూర్ కు వెళ్లే ప్రధాన రహదారిపై తాగునీటి కోసం రాస్తారోకో నిర్వహించారు. స్థానికులు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు ప్రజాప్రతినిధులు, అధికారులు శాశ్వత పరిష్కారం చూపారు. అందులో భాగంగా యుద్ధ ప్రాతిపాదికన గురువారం బోరు బావికి కొత్త మోటర్ ను బిగించేలా చర్యలు తీసుకొని ప్రారంభించారు. మిషన్ భగీరథ తాగునీరు రాని రోజున ఈ బోరు బావి నీరును వాటర్ ట్యాంకు ఎక్కేలా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ మనోహర్, పంచాయితీ ఈఓ దివాకర్, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం




**బెజ్జూర్:** మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ గిడ్డంగిలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ రామ్మోహన్ రావు ఎంపీడీఓ ప్రవీణ్, ఏఓ నాగరాజ్, ఏపిఎం మోహన్ దాస్, సర్పంచ్ దుర్గం సరోజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బానోతు నాగరాజు మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని అన్నారు. అలాగే తప్పలు, తాలు, మైచర్ లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం వద్ద కొనుగోలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ మండల సమైక్య అధ్యక్షురాలు మాధవి, కార్యదర్శి రజిత, సెంటర్ ఇంచార్జి సీసీ సుశీల, రంగయ్య, భద్రయ్య, వీఓ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి రజియ బేగం, వీఓఏ పెద్దల సంతోష్, సురేష్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## నేరడిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏలేటి రాజశేఖర్ రెడ్డి



**నేరడిగొండ:** నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏలేటి రాజశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ సిఫార్సుల మేరకు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఈ నియామకానికి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. బోథ్ నియోజకవర్గ పరిధిలోని పది మండలాలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధిష్టానం జాబితాను విడుదల చేసింది. ఇందులో భాగంగా నేరడిగొండ మండల పార్టీ బాధ్యతలను ఏలేటి రాజశేఖర్ రెడ్డికి అప్పగించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా అంకిత భావంతో పనిచేయాలని టీపీసీసీ సూచించింది. రాజశేఖర్ రెడ్డి నియామకం పట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. డాక్టర్ నరేష్ జాదవ్ నాయకత్వంలో నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం, జిల్లా నాయకత్వానికి ఏలేటి రాజశేఖర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## జనగణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్:** జనగణన ప్రక్రియను పకడ్బందీగా, ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న జనగణన సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు నమోదు చేస్తున్న సెన్సస్ నంబర్లు, వారు సిద్ధం చేసిన లేఅవుట్ మ్యాపులను కలెక్టర్ స్వయంగా కాలనీలో ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. జనగణన-2027 లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత సూపర్వైజర్ గణేష్, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అత్యధిక పోక్సో కేసులు

- దేశంలో 100 పోక్సో కేసుల్లో 44 కేసులు బీజేపీ నాయకులపైనే
- బాధిత బాలికకు న్యాయం చేయాలని డిమాండ్



**కాగజ్నగర్:** బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అత్యధిక పోక్సో కేసులు నమోదవుతున్నాయని, దేశంలో వంద పోక్సో కేసుల్లో 44 కేసులు బీజేపీ నాయకులపైనే ఉన్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మైనర్ బాలికకు సంబంధించిన పోక్సో కేసు వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసులో బీఆర్ఎస్ పోరాటం చేయకపోతే కేసు ఎప్పుడో మూసివేసే పరిస్థితి వచ్చేదని పేర్కొన్నారు. బాధితురాలి ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం బాధితురాలి గుర్తింపును బయట పెట్టడం నేరమని గుర్తుచేశారు. కేసులో ఈ నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడికి నేర చరిత్ర ఉందని పోలీసు రికార్డుల ఆధారంగా తెలుస్తోందని పేర్కొన్నారు. అతను కనిపిస్తే 1098, 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోబోమని, పోలీసులకు సహకరిస్తామని తెలిపారు. డీజీపీ, సీపీ ఇప్పటివరకు మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ నేత బండి సంజయ్ కుటుంబాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మంత్రి కొండా సురేఖ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సిట్ అధికారి రితురాజ్ బాధ్యతలు చేపట్టిన తర్వాతే కేసులో కొంత పురోగతి కనిపించిందని పేర్కొన్నారు. గతంలో పేట్ బషీరాబాద్ పోలీసు అధికారులు కుట్రపూరితంగా తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని ఆరోపించారు. కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, బాధితురాలి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని కుట్ర జరుగుతోందని విమర్శించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్, వీడియోల ప్రచారంతో బాధితురాలు మానసిక ఒత్తిడికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డీజీ ఉమెన్ సేఫ్టీ, సైబర్ సెక్యూరిటీ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని వీడియోలు, ఫోటోలు తొలగించాలని కోరారు. వీడియోలు షేర్ చేస్తున్న వారిపై నోటీసులు లేకుండానే అరెస్టులు చేసి పరికరాలు స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొన్నారు. బండి సంజయ్ను ఈ కేసులో ఏ2గా చేర్చాలని, సంబంధిత వ్యక్తుల ఫోన్ కాల్ రికార్డులు, సీసీటీవీ ఫుటేజీలు సేకరించాలని డిమాండ్ చేశారు. కేసును మేజర్-మైనర్ చర్చగా మలుస్తున్నారని, ఒకవేళ అమ్మాయి మేజర్ అయితే అఘాయిత్యం సమర్థనీయమా అని ప్రశ్నించారు. బీజేపీ ఐటీ సెల్, కొన్ని సోషల్ మీడియా వేదికలు బాధితురాలిపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపిస్తూ, సంబంధిత యూట్యూబ్ ఛానళ్లు, సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫేస్బుక్, ట్విట్టర్ యాజమాన్యాలకు ప్రభుత్వమే లేఖలు రాసి కంటెంట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశ వ్యాప్తంగా గతంలో బీజేపీ నేతలపై నమోదైన పలు పోక్సో, లైంగిక దాడి కేసులను ప్రస్తావిస్తూ "బీజేపీ చరిత్రనే పోక్సో చరిత్ర" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మహిళా నాయకులు, ఇతర రాజకీయ పార్టీలు కూడా బాధితురాలికి మద్దతుగా నిలవాలని కోరారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుని పారదర్శక విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** 2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం కింద 1, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 1వ తరగతికి 91 సీట్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతికి 92 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు ఈనెల 16వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని రూమ్ నం.3లో ఉన్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారములు కార్యాలయ పనివేళల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కుటుంబంలో ఒక అభ్యర్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలని వివరించారు. దరఖాస్తుతో పాటు జనన ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలు సమర్పించాలని తెలిపారు. 5వ తరగతి ప్రవేశాల కోసం 4వ తరగతి బోనఫైడ్, గత సంవత్సరం మార్కుల మెమో ప్రతులు జత చేయాలని సూచించారు. అన్ని పత్రాల నకలు ప్రతులపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ సంతకం చేయించి సకాలంలో సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకం

- యువ ఓటర్ల నమోదు, మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
- భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్





**మంచిర్యాల:** ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి అత్యంత కీలకమని భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు. గురువారం ఎంపిక చేసిన రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎన్నికకు ముందు ఓటరు జాబితాలను నవీకరించడం ఎన్నికల సంఘం బాధ్యత అని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన, ఆయా నియోజకవర్గాల్లో సాధారణ నివాసితులుగా ఉన్న ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు కావచ్చని పేర్కొన్నారు. యువ ఓటర్ల నమోదు, మహిళల భాగస్వామ్యం, దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇంటింటి సర్వేలు, పోలింగ్ స్థాయి అధికారుల పనితీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. 2025 అక్టోబర్ 27 నాటికి ఉన్న ఓటర్లందరికీ పాక్షికంగా పూరించిన ఎన్యూమరేషన్ ఫారమ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఫారమ్ల సేకరణ కోసం బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించేలా చూడాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ సమర్పించిన ప్రతి ఓటరును ముసాయిదా జాబితాలో చేర్చాలని, విచారణ లేకుండా ఎవరిపేరును తొలగించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా ప్రతి కేంద్రంలో 1,200 మందికి మించి ఓటర్లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హై-రైజ్ భవనాలు, మురికివాడల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడంతో పాటు బూత్ స్థాయి ఏజెంట్ల నియామకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. ముసాయిదా ఓటర్ల జాబితాను వెబ్సైట్తో పాటు స్థానిక కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పేర్ల చేర్పులు, తొలగింపులు, సవరణల కోసం ఫారమ్ 6, 7, 8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని, విచారణ అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. తుది జాబితాపై అసంతృప్తి ఉంటే జిల్లా మేజిస్ట్రేట్కు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు వేగవంతంగా తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని సుముఖ గోదాం, మండల కేంద్రంలోని జయలక్ష్మి రైస్ మిల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని కేటాయించిన మేరకు రైస్ మిల్లులు, గోదాములకు తరలించి త్వరితగతిన దిగుమతి చేయాలని ఆదేశించారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు, రవాణా, దిగుమతి ప్రక్రియలు అనుసంధానంగా సాగాలన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో అవసరమైన లారీలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి కొనుగోలు వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు రైస్ మిల్లర్ల యజమానులు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**నర్సాపూర్:** నర్సాపూర్ మున్సిపల్ పట్టణంలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాల జూనియర్ కళాశాల బాయ్స్-1లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఇంచార్జి ప్రిన్సిపల్ కొండ మురళి తెలిపారు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అర్హత గల ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన అడ్మిషన్లు పొందాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు అందించబడతాయని తెలిపారు. తల్లిదండ్రులు అవసరమైన ధ్రువపత్రాలతో పాఠశాలలో సంప్రదించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.





# శివ పూజకు

## ఉద్దిష్టమైనది మాస శివరాత్రి

మాస శివ రాత్రి. ప్రతి నెలా వచ్చే మన శివుని పండుగ. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా కృష్ణ పక్షం చతుర్దశి నాడు ఆ భోళా శంకరుని ఉద్దేశించి చేసుకునే పూజ. ఈ రోజున ఉపవాసం, ప్రదక్షిణాలు ప్రత్యేకముగా, విశిష్టముగా ఉంటాయి. చంద్రమా మనసో జాతః అని పెద్దలు చెపుతూ ఉంటారు. అంటే చంద్రుడు మన మనస్సుకు కారకుడు. చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడు కేతువు ప్రభావము ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ చంద్రుడిని తల పైన పెట్టుకున్న చంద్రశేఖరుని శరణు వేడడం సదాచారం. ఓం నమఃశ్శివాయ అనే పంచాక్షరీ మహా మంత్రం యజుర్వేదం రుద్రాధ్యాయం లోనిది. 'న, మ, శి, వ, య. మంత్రం' 'ఓం' కారంతో ప్రారంభం అవుతుంది. ఓం... మహాబీజాక్షరం. 'న' అనేది భగవంతునిలోని కాంతిని తెలియ చేస్తున్న ఈ పంచాక్షరాలను పంచభూతాలు అని కూడా అంటారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు నిర్వచనం చెప్పారు. ఈ మంత్రోచ్చారణ పంచ భూతాల సంబంధంగా చెపుతారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు వివరణ ఇచ్చారు. మానవ శరీరం పంచభూతాత్మకం. నమశ్శివాయ అనే అయిదు అక్షరాలను పలికినప్పుడు పంచ భూతాలతో నిండిన శరీరం శుభ్రమవుతుంది. ఒక్కో అక్షరం ఒక్కో భూతాన్ని శుభ్రం చేస్తుంది. 'న' భూమికి సంబంధించిన భాగాలను, 'మ' నీటికి సంబంధించిన భాగాలను, 'శి' అగ్నికి సంబంధించిన భాగాలను, 'వ' గాలికి సంబంధించిన భాగాలను, 'య' ఆకాశానికి సంబంధించిన భాగాలను పరిశుభ్రం చేస్తాయి. భోళా శంకరుడు అభిషేక ప్రియుడు నాలుగు చుక్కల నీరు పోసి, మూడు దళాలు ఉన్న బిల్వ దళం మనసారా పెడితే సంతోషించి వరాలనిచ్చే వరదుడు. శివభక్తుడైన సౌనంద గణేశ ముని ఒకసారి యమ లోకానికి వెళ్లగా యమధర్మరాజు ఆయనను సత్కరించి, వచ్చిన కారణమేమిటని అడిగాడు. తాను యమలోకంలోని విశేషాలను చూడడానికి వచ్చినట్లు ముని చెప్పారు. దీంతో తన లోకంలో నరక యాతనలు

అనుభవిస్తున్న పాపాత్ములను యముడు ఆ మునికి చూపించాడు. వారి పరిస్థితికి జాలిపడిన ఆ మహర్షి.. ఓ జనులారా! ఇది 'ఓం నమశ్శివాయ' అనే మంత్రం దీనిని ఉచ్చరిస్తే మీ యాతనలు పటాపంచ లవుతాయని తెలిపారు. ముని చెప్పగా వారంతా పంచాక్షరిని జపించారు. దీంతో వారికి నరక విముక్తి లభించి, అంతా కైలాసం చేరుకున్నారట. అధికార గర్వముతో దుర్వాస మహర్షిని అవమానించిన దేవేంద్రుడు ఆ మహానుభావుని శాప కారణంగా తన సమస్త సంపదలు సముద్రం పాలు అవ్వడం చూస్తూ ఉండి పోయాడు. మందర పర్వతమును కవ్వముగా, వాసుకిని తాడుగా చేసుకుని క్షీర సాగరమును మథించినప్పుడు ముందుగా లోకాలన్నిటినీ భస్మం చేస్తుందా అని అనిపించేలా ఉగ్రతతో హాలాహలం పుట్టింది. అమ్మవారి అనుమతి తీసుకుని ఆ లోకాధారుడు ఆ కాలకూట విషయాన్ని తాను స్వీకరించి లోకాలను కాపాడాడు. క్షీరసాగర మథనం మరలా కొనసాగేలా చూసాడు. తన లోపల ఉన్న లోకాలకు కష్టం కలగకుండా గొంతులోనే నిలుపుకుని శ్రీకంఠుడు, గరళకంఠుడు, నీలకంఠుడు అయ్యాడు. శివుడికి ఈ రోజును ప్రీతి పాత్రమైన రోజున శివుడికి అభిషేకాలు, పూజలు చేయడం వలన కోరిన కోర్కెలు నెరవేరుతాయి అని ప్రతీతి. శివరాత్రి అనగా శివుని జన్మదినం (లింగోద్భవం) అని అర్థం. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా జరుపుకునేదే మాస శివరాత్రి. మహాశివుడు లయ కారకుడు. లయానికి (మృత్యువునకు) కారకుడు కేతువు. అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి సమయంలో చంద్రుడు క్షీణించి ఉంటాడు. చంద్రమా మనసో జాతః అనే సిద్ధాంతము ప్రకారము చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడూ జీవులపై ఈ కేతు ప్రభావము ఉండటము వలన వారి వారి ఆహారపు అలవాట్లపై ప్రభావము చూపడం వలన జీర్ణశక్తి మందగిస్తుంది. తద్వారా మనస్సు ప్రభావిత మవుతుంది. మాస శివరాత్రి నాడు ఉపవాసము ఉండి, వీలైతే శివాలయ దర్శనం చేసుకొని, శక్తి మేర 3, 5, 11, 18, 21, 54, 108 ఇలా ప్రదక్షిణలు చేయవచ్చు. అదేవిధంగా ఆరోజు ప్రదోష వేళ శివునకు మారేడు దళములతో లేదా కనీసము గంగా జలముతో అభిషేకాది అర్చనలు చేయడము మంచిది. ఇవేమీ చేయడానికి అవకాశములేని వారు, ఆరోగ్యవంతులు, అలాగే గృహములో అశౌచ దోషము లేనివారు ఈ రోజు ఉపవాసము ఉండడం చేయాలి. శివనామ స్మరణ చేస్తూ సాయంకాలం ప్రదోష సమయంలో శివునికి అభిషేకం చేయాలి. అభిషేకానంతరం, బిల్వాష్టోత్తరం చెపుతూ బిల్వ దళాలను శివునికి అర్పించాలి. కనీసం ఉపవాసం ఉండి, సాయం కాలం శివాలయానికి వెళ్ళి దీపారాధన చేసి పంచాక్షరీ మంత్రమైన ఓం నమః శివాయను జపించడం కూడా మంచిది. పన్నెండు మాస శివరాత్రులలో ఏ శివరాత్రికైనా సత్కర్మలు చేయడం వల్ల సత్ఫలితాలు పొందుతారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్త్రీ స్వేచ్ఛ కోసం నిరంతర పోరాటం

**మల్లాది సుబ్బమ్మ**

**మే 15...మల్లాది సుబ్బమ్మ వర్ధంతి**

మల్లాది సుబ్బమ్మ (ఆగస్టు 2, 1924 – మే 15, 2014) ఒక విభిన్న భావజాలానికి ప్రాతినిధ్యం వహించిన హేతువాది, స్త్రీవాద రచయిత్రి, సంఘ సంస్కర్త. గుంటూరు జిల్లా రేపల్లె మండలం పోతార్లంకలో జన్మించిన ఆమె బాల్యం నుంచే సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను గమనించి, ఆత్మలో మలుచుకున్న చైతన్యాన్ని కాలంగా మార్చి వేశారు. సమానత్వం, స్వేచ్ఛ, విద్యా హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం ఆమె జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసేందుకు దోహద పడింది.

ఆమె స్త్రీల హక్కుల కోసం సంఘటిత ఉద్యమానికి ప్రణాళికగానే నిలిచారు. "స్త్రీ స్వేచ్ఛ" అనే పత్రికను సంపాదకురాలిగా నడిపిస్తూ, మహిళల గొంతును బలంగా ప్రతిధ్వనించే వేదికగా మలిచారు. ఆమె రచనలు ధైర్యాన్ని, స్పష్టతను ప్రతిబింబించేవి. హేతువాదాన్ని బలంగా నమ్మిన ఆమె మూఢ నమ్మకాల్ని ప్రశ్నించారు. మహిళల నైతిక, సామాజిక స్వాతంత్ర్యానికి ఆమె లౌకిక విలువలతో నిలిచిన అర్థవంతమైన ప్రతినిధిగా మారారు.

ఆంధ్రప్రదేశ్‌లో మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి ఆమె అందించిన నాయకత్వం ప్రత్యేక గుర్తింపు పొందింది. 1990వ దశకంలో మహిళలు మద్యం ప్రభావంతో పడుతున్న బాధలను గమనించి, ఆందోళనలకు పూనుకొని రాష్ట్ర వ్యాప్తంగా చైతన్యాన్ని నింపారు. ఆమె ఉద్యమం ఫలితంగా 1994లో రాష్ట్ర ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలు చేయడం ఆమె నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.

మల్లాది సుబ్బమ్మ హైదరాబాదులో "ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ ఉమెన్" సంస్థను స్థాపించి, మహిళా



అభ్యున్నతికి శాస్త్రీయ దృక్పథంతో కూడిన శిక్షణా శిబిరాలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ మానవ హక్కులు, లౌకికవాదం, స్త్రీ సమానత్వం గురించి ప్రసంగించారు. మానవతా విలువలను ప్రజలలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో ఆమె నిరంతరంగా చురుగ్గా ఉండటం ఒక ఉద్యమంగా మారింది.

సాహిత్యంలోనూ ఆమె తనదైన ముద్ర వేసారు. ఆమె దాదాపు 110 పుస్తకాలు, 500కు పైగా వ్యాసాలు రచించారు. మహిళల సమస్యలు, ఉద్యమాలు, చట్టబద్ధ హక్కులు, సామాజిక సంక్షోభాలు ఆమె రచనలకు ప్రాణస్వరూపం. బానిస కాదు దేవత కాదు, ఓ మహిళా! ముందుకు సాగిపో, తరతరాల స్త్రీల పరాజయ గాథ, పతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా వంటి రచనలు మహిళా చైతన్యానికి మేటి ఉదాహరణలుగా నిలిచాయి. ..Women and Social Reform….Status of Indian Wom en…..Women in Changing Society.. వంటి ఆంగ్ల రచనలు దేశవ్యాప్తంగా పఠితులను ప్రభావితం చేశాయి.

ఆమె రచనలు గర్భించిన సందేశం – స్త్రీ శక్తిని ఒడిసి పట్టుకోవాలన్న తపన, మానవీయత మీద నమ్మకం, సమాజపు సంక్షోభాలపై బహిరంగంగా మేధోపరమైన పోరాటం. ఆమె ఆత్మకథ పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా అంటేనే ఆమె వ్యక్తిత్వ ప్రయాణానికి నిక్షిప్త రూపం. 2012లో మల్లాది సుబ్బమ్మ తనకు ఉన్న ఆస్తులన్నింటిని విక్రయించి, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో మహిళా అధ్యయన కేంద్రం భవన నిర్మాణానికి విరాళంగా ఇవ్వడం ఆమె జీవిత ఆశయానికి శాశ్వత సాక్ష్యంగా నిలిచింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన చేయడం ఆమె లోతైన సామాజిక చింతనకు నిదర్శనం.

మల్లాది సుబ్బమ్మ ఒక రచయిత్రిగా, ఆలోచనాపరురాలిగా, ఉద్యమ కారిణిగా మరియు స్ఫూర్తిదాయకంగా మహిళల సాధికారత కోసం యావజ్జీవం అంకితమయ్యారు. ఆమె జీవితం, రచనలు, ఉద్యమం ఇప్పటికీ సమానత్వానికి ఆకాంక్షించే వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆమె చేసిన కృషి తెలుగు మహిళా ఉద్యమ చరిత్రలో ఒక చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచిపోతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494


# వింజమూరి శివరామారావు హాస్య సాహిత్యానికి హృదయ స్వరం

**మే 15...వింజమూరి జయంతి**

తెలుగు సాహిత్యంలో హాస్య రచనకు మానవీయతను మేళవించి, జీవన వాస్తవాలపై వినోదభరితంగా స్పందించిన సాహితీవేత్తల్లో వింజమూరి శివరామారావు అగ్రగణ్యులు. ఆయన కవి, కథకులు, నాటక రచయిత, పాత్రికేయుడు, ఆకాశవాణి ప్రసార కర్తగానూ విశిష్ట సేవలందించారు. 1908 మే 15న పిఠాపురం తాలూకా చంద్రపాళెంలో జన్మించిన శివ రామారావు, గౌతమి అనే కలం పేరుతో రచనలు చేశారు. అభ్యుదయ కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆయన మేనమామ కావడం విశేషం.

పత్రికా రంగంలో ఆయన 'జ్వాల', 'నవోదయ' వంటి పత్రికలలో సహాయ సంపాదకులుగా పని చేశారు. పత్రికా జీవితంలో సంపాదక దృష్టితో జోలి పడకుండా హాస్యాన్ని సత్యాల మెడల మీద అలంకారంగా వేసారు. 1949 నుంచి 1968 వరకు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేస్తూ నాటకాలు, స్కిట్లు, శ్రావ్య ప్రసంగాల రూపంలో ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారు. ఆయన గొంతులో వినిపించిన మాటలు ప్రజల హృదయాలను తాకేవి.

వింజమూరి రచనా జీవితం హాస్యాన్ని ఆధునికీకరించడంలో కీలకమైన పాత్ర పోషించింది. కథలు, వ్యాసాలు, నాటకాలు అన్నింటిలోనూ సామాజిక పరిశీలనకు ఓ చీకటి వెలుతురులా హాస్యాన్ని వాడారు. ఆయన రచించిన 'విజయ పతాక', 'కళా రాధన', 'రజక లక్ష్మి', 'కళోపాసన', 'కృష్ణ. దేవరాయలు', 'విశ్వామిత్ర'



వంటి నాటకాలు సామాజిక స్పృహను ప్రతిబింబించే విధంగా ఉండగా, 'బుర్ర కథలు', 'బాబూ భాస్కర్', 'కార్యాలయ కబుర్లు', 'వింజమూరి వినోదాలు' వంటి హాస్య కథా సంకలనాలు సామాన్య ప్రజల జీవితానుభూతులకు అద్దం పట్టేవిగా నిలిచాయి.

వింజమూరి రచనలు మామూలుగా నవ్వించేవి కావు. అవి మనల్ని మనమే చూసుకునే అద్దాలుగా మారతాయి. మధ్య తరగతి జీవిత విశేషాలు, ఉద్యోగుల అనుభవాలు, భర్త–భార్యల మధ్య సంభాషణల హాస్య రస తత్త్వం, అలాగే ఆఫీసు రాజకీయాలపై వ్యంగ్యం ఆయన రచనల ప్రత్యేకత. భాషపై ఆయనకు ఉన్న పట్టు, హైదరాబాదీ ఉర్దూ మేళవింపుతో కూడిన సంభాషణలు, ప్రజల మధ్య చలామణీగా ఉన్న మాటల ప్రయోగం అన్నీ ఆయన రచనలను అందరికీ చేరువ చేస్తాయి.

తెలుగు భాషా సంపదకు ఆయన చేసిన సేవలను గుర్తించి ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారు శివరామారావును 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించడం గర్వకారణం. 1982లో విజయవాడలో ఆయన మకుటం లేని మహా రాజులా జీవించి కన్నుమూశారు. కానీ, ఆయన రచనలు నవతర పాఠకులను ఇప్పటికీ అలరిస్తూనే ఉన్నాయి. ఆయన హాస్యం ముళ్ల మధ్య పువ్వులా – మనకు నవ్వు తీసుకొస్తూనే, లోతైన సందేశాన్ని అందిస్తుంది.

తెలుగు సాహిత్యంలో హాస్య రచనను ఒక ప్రత్యేక ప్రక్రియగా మలిచిన వింజమూరి శివరామారావు, సాహితీ పఠనంలో మనల్ని ఆలోచింపజేసే హాస్యానికి ప్రతీక. ఆయన కలం నిలిపిన పదాలు కాలంతో మారిపోకుండా తెలుగు ప్రజల హృదయాలలో ఎప్పటికీ నిలిచి ఉంటాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# విలక్షణ గాయని కె. జమునారాణి

**మే 15... జమునారాణి జయంతి**

తెలుగు సినిమా పాటల ప్రపంచంలో కె. జమునారాణి ఓ విలక్షణ స్థానాన్ని సంపాదించారు. తన మధురమైన గాత్రంతో వేలాది పాటలు పాడి, శ్రోతల హృదయాలను గెలుచుకున్న ఈ గాయని, దక్షిణాది చిత్ర సంగీతంలో చిరస్థాయిగా నిలిచి పోయారు. ఆమె గొంతు శ్రావ్యతకు, భావ నిష్ఠకు ప్రతిరూపంగా మారింది.

1938 మే 17న ఆంధ్రప్రదేశ్‌లోని సంగీత పరంపర గల కుటుంబంలో ఆమె జన్మించారు. తల్లి కె. ద్రౌపతి ప్రసిద్ధ వయొలిన్ విద్వాంసురాలు. చిన్ననాటి నుంచే సంగీతానికి ఆసక్తి చూపిన జమునారాణి, ఏడేళ్ల వయస్సులోనే 1946లో విడుదలైన తెలుగు చిత్రం త్యాగయ్య లో బాల గాయకురాలిగా గాత్ర ప్రస్థానం ప్రారంభించారు.

అనంతరం తమిళ చిత్రాల్లో ఆమె స్వరం విశేషంగా మెప్పించగా, 1952లో 'వలయపతి', 'కళ్యాణి' చిత్రాల్లో ప్రధాన గాయనిగా గుర్తింపు పొందారు. 1955లో వచ్చిన తమిళ చిత్రం గులేబకావళి లోని పాట ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, సింహళ భాషల్లో కలిపి 6000కి పైగా పాటలు పాడిన అరుదైన గాయనుల్లో ఆమె ఒకరు.

1953లో శ్రీలంక సినీరంగం లోకి ప్రవేశించి, అక్కడి సింహళ భాషా చిత్రాలలో కూడా ఆమె గాత్రం ద్వారా ప్రసిద్ధి చెందారు. 'సుజాత' (1953), 'వరద కాగెడ' (1954), 'సెడ సులంగ్' (1955), 'మథలన్' (1955), 'సురయ' (1957), 'వన మోహిని' (1958) వంటి చిత్రాల్లో పాటలు పాడి, శ్రీలంక సంగీత ప్రియుల హృదయాల్లో చోటు సంపాదించారు. ఆమె పాడిన "జీవన మే గమన సంసారే" పాట శ్రీలంక చలనచిత్ర గీతాల పత్రంలో అపురూపంగా నిలిచి పోయింది.



1970లలో కొంతకాలం విరామం తీసుకున్న జమునారాణి, 1987లో మణిరత్నం రూపొందించిన 'నాయకన్' చిత్రంలోని "నా నవ్వే దీపావళి" పాటతో మళ్ళీ శ్రోతల మనసులను దోచుకున్నారు. అనంతరం 1992లో 'అన్నన్ ఎన్నడ తంబి ఎన్నడ' వంటి తమిళ చిత్రాల్లో పాటలు పాడారు. 1950ల నుండి 1960ల వరకు తెలుగులో 'మూగ మనసులు', తమిళంలో 'పాసమలర్' వంటి అనేక హిట్ చిత్రాల్లో ఆమె గానం ప్రతిభను చూపింది.

జమునారాణి అనేక సంగీత దర్శకుల మద్దతుతో తమ సంగీత ప్రయాణాన్ని సాగించారు. ఘంటసాల, కె.వి. మహదేవన్, జి. రామనాథన్, సాలూరి రాజేశ్వర రావు, ఎస్.వి. వెంకట్రామన్, ఇళయరాజా, చంద్రబోస్ వంటి దిగ్గజుల గీతాలకు ఆమె గళమెత్తారు. టి.ఎం. సౌందర రాజన్, ఎ.ఎం. రాజా, పి.బి. శ్రీనివాస్, సీర్కాళి గోవింద రాజన్ వంటి గాయకులతో పాడిన యుగళ గీతాలు శ్రోతల హృదయాల్లో మిగిలి పోయాయి. మహిళా గాయకులైన పి. సుశీల, లీల, జిక్కి, ఎల్.ఆర్. ఈశ్వరి లాంటి వారితో కలిసి పాడిన పాటలు కూడా విశేషంగా నిలిచాయి.

"ఓ చందమామ", "పొత్తిళ్లలో ఉన్న పాపాయి", "నీవు లేని లోకం", "అందం చందం నీదే", "వెన్నెల్లో గోదారి అందం", "నా నవ్వే దీపావళి", "సొల్లట్టుమా సొల్లట్టుమా" వంటి పాటలు ఆమె గాత్ర సౌందర్యానికి తార్కాణాలుగా నిలిచాయి. గళం లోతు, స్వరాల స్పష్టత, భావ వ్యక్తీకరణలో నిపుణత ఆమె ప్రత్యేకతలు.

తన గాత్ర సేవలకు గుర్తింపుగా జమునారాణి అనేక పురస్కారాలు అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం అందించిన ' మామణి' (1998), 'అరింగ్నార్ అన్నా అవార్డు' (2002), 'పురచ్చితలైవి జయలలితా అవార్డు' (2020)తో పాటు పలు సంగీత సంస్థల లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను అందుకున్నారు.

ప్రచారానికి దూరంగా ఉండే స్వభావం, సంగీతం పట్ల అంకిత భావం ఆమె వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దాయి. జమునారాణి పాటలు కేవలం వినోదం కాదు – అవి సంగీతం పట్ల ఉన్న భక్తి శ్రద్ధలకు చిరునామాలు. ఆమె గానం సంగీత ప్రేమికులకు నిత్యం వినిపించే తియ్యని జ్ఞాపకం. శ్రోతల హృదయాలలో ఆమె స్థానం యుగాల పాటు నిలిచి పోతుంది.

ఇలాంటి గాన గంధర్వుల స్వరం వందల ఏళ్ల తర్వాత కూడా సంగీత వీధుల్లో మార్మోగుతూనే ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

## నేడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి

"నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహామతిః, స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం" ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరథుడైన ఆంగ్లేయ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం.

కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు.

కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు.

అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుఫున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828–29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు. కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు. అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్వర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది.


1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహుదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు. తర్వాత 1852 గన్నవరం అక్విడక్టు పనులు కూడా కాటన్ ప్రారంభించారు. ఐదేళ్ల లోనే నిర్మాణం జరగడంతో 1852 నాటికి అందుబాటు లోకి వచ్చింది.

ధవళేశ్వరం వద్ద ప్రస్తుతమున్న సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కి పూర్వ రూపంగా ఆనకట్ట ఉండేది. అనేక వరదల తాకిడికి ఆనకట్ట దెబ్బ తినడంతో చివరకు 1970వ దశకంలో కొత్తగా బ్యారేజ్ నిర్మాణం చేశారు. 20వ శతాబ్దం తొలినాళ్లలోనే ఆయా ప్రాంతాల్లో వెన–ువెంటనే ఆరు లక్షల ఎకరాల భూమి సాగు కిందికి రావడం తో పాటు, పారిశ్రామికాభివృద్ధి, విస్తారంగా పంటలు, రవాణా సదుపాయాలు ధవళేశ్వరం ఆనకట్ట ద్వారా గోదావరి జల ప్రవాహం ద్వారా లభించాయి. కృష్ణానదిపై విజయవాడ వద్ద ఆనకట్టకు ప్రోద్బలం కూడా కాటన్ దే. ఆయన బెంగాల్, ఒడిసా, బీహారు, మొదలైన ప్రాంతాల నదులను మానవ ఉపయోగం చేయడానికి ఎన్నో పరిశోధనలు, పరిశీలనలు చేశాడు. తెలుగు వారే కాదు తమిళులు, ఒరియాలు, బెంగాలీలు, ఒరియాలు, బీహారీలు మొత్తం భారతీయులే ఆయనకు ఎంతో రుణ పడి ఉంటారు. తమపాలిట దుఃఖదాయినిగా ఉన్న గోదావరిని, ప్రాణదాతగా మార్చిన ఆర్థర్ కాటన్... అపర భగీరథునికి, ప్రాతః స్మర స్మరణ చేయడం తప్ప ఏమిచ్చుకో గలరు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# విప్లవ అమర వీరుడు సుఖ్‌దేవ్

## నేడు సుఖ్‌దేవ్ జయంతి



భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ముగ్గురు అమర వీరుల త్యాగం మరువ లేనిది. పంజాబ్ కేసరి బిరుదాంకితులైన, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు లాలా లజపత్ రాయ్ సైమన్ కమీషన్ కు వ్యతిరేకంగా లాహోర్ లో జరిగిన నిరసన ఊరేగింపులలో ఇంగ్లీషు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్ చేతిలో ఘోరంగా లాఠీ దెబ్బలు తిని, 1928 నవంబరు 17న మరణించారు. ఈ క్రమంలో లజపత్ రాయ్ హత్యకు ప్రతీకారంగా, స్కాట్ ను హతమార్చే వ్యూహం అమలులో పొరపాటున స్కాట్ అనుకుని జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను ముగ్గురికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్, రాజ్‌గురుతో పాటు సుఖ్ దేవ్ థాపర్ ను 1931 మార్చి 23న లాహోరు సెంట్రల్ జైలులో సాయంకాలం ఉరి తీశారు. అలా ఆ ముగ్గురు త్యాగ మూర్తులు అమరులైనారు. సుఖ్‌దేవ్ థాపర్ (15 మే 1907 – మార్చి 23, 1931) భారత స్వాతంత్ర్య సమర, ఉద్యమ కారుడు. ఆయన భగత్ సింగ్, రాజ్‌గురుల సహచరుడు.

సుఖ్‌దేవ్ హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అనే సంస్థలో ముఖ్యమైన నాయకుడు. లాహోర్ నేషనల్ కాలేజిలో భారత పురాతన ఔన్నత్యాన్ని అధ్యయనం చేయడానికి, ప్రపంచ విప్లవ పరిణామాలు పరిశీలించడానికి ఒక అధ్యయన కేంద్రాన్ని (స్టడీ సర్కిల్) ప్రాంభించాడంటారు. తన సహచరులైన భగత్ సింగ్ , కామ్రేడ్ రామచంద్ర, భగవతీ చరణ్ వోహ్రా లతో కలిసి లాహోరులో "నవ జవాన్ భారత సభ" ప్రారంభించాడు. దేశ స్వాంతంత్ర్యానికి యువతను ఉత్తేజితులను చేయడం, ప్రజలలో హేతు వాదాన్ని పెంపొందించడం, మత వైషమ్యాలను నిరోధించడం, అంటరాని తనాన్ని అరికట్టడం ఆ సంస్థ ఆశయాలు. పండిట్ రామప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర ఆజాద్‌ల ప్రభావం సుఖదేవ్‌పై బలంగా ఉండేది. ఖైదీల పట్ల చూపుతున్న అమానుష విధానాలకు వ్యతిరేకంగా 1929లో జరిగిన నిరాహార దీక్షలో సుఖదేవ్ పాల్గొన్నాడు.

1927లో భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్ లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాలా లజపత్ రాయ్ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపించారు. ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమిస్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెండెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీతో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చనిపోయాడు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవ కారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్ లతో భగత్ సింగ్ చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొరపాటుగా స్కాట్ అనుకుని, జైగోపాల్ ఆయనను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితంగా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చినందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను ప్రచురించారు. 'ఘొఁతీఁఘుత్ శీట జుఇవఎఖఅశీఅ ూఅ ూవఅవ్వఅఎవ ూట ఐవఎఘ్‌ష్ట' అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు.

1930 అక్టోబర్ 7న న్యాయ స్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ వివిధ శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింగ్ 2. సుఖ్‌దేవ్ 3. రాజగురులకు; అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీ లాల్ 2. మహావీర్ సింహ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయ దేవ్ కపూర్ 7. కమల్ నాథ్ తివారి లకు; అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ (7సంవత్సరాలు) 2. ప్రేమదత్ (5 సంవత్సరాలు)కు; అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్ లను విడిచి పెట్టారు. విచారణలో ఉన్న వారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలులో వినిపించారు.


తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయ కుండా కాల్పుల బృందం చేత హత మార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్‌సింగ్, మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయనను ఉరి తీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరి తీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరి తీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని...సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. తాపర్ సుఖ్ దేవ్, శివరామ్ రాజ్‌గురు లను లాహోర్ సెంట్రల్ జైలులో తర్వాత ఉరి తీశారు. వారి మృత దేహాలను సట్లెజ్ నది ఒడ్డున రహస్యంగా దహనం చేశారు.

సుఖ్‌దేవ్‌ను ఉరి తీయడానికి ముందు, ఆయన మహాత్మా గాంధీకి ఒక లేఖ వ్రాశాడు. విప్లవ మార్గంలో ఉద్యమిస్తున్న వారిపట్ల మహాత్మా గాంధీ అనుసరిస్తున్న ప్రతికూల ధోరణిని ఈ లేఖలో సుఖ్‌దేవ్ విమర్శించాడు. సుఖ్‌దేవ్‌కు ఉరి శిక్ష వేయడానికి ఆధారమైన ప్రధాన సాక్ష్యం హంసరాజ్ వోహ్రా ఇచ్చాడు. అయితే సుఖ్ దేవ్ స్వయంగా తన నేరాన్ని అంగీకరించాడని వోహ్రా వివరించాడు. ముగ్గురు త్యాగధనుల వీర మరణాలు వృధా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# స్వార్థమే పరమార్థం... కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం

## నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం



కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది బంధువుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండేవి. ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో.

విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం. కుటుంబ దౌర్జన్యం చట్టం 498–ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని అనుభవజ్ఞుల భావన. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయమిది. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి అంశాలపై నేటి తరానికి అవగాహన కల్పించాల్సిన తరుణమిది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# మళ్లీ పెరుగుదల బాటలో పసిడి ధరలు

హైదరాబాద్, మే 14: దేశవ్యాప్తంగా బంగారం ధరలు మరోసారి పెరిగాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, దిగుమతి సుంకాల పెంపు ప్రభావంతో పసిడి ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా బంగారం, వెండిపై దిగుమతి సుంకం పెరగడంతో మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరిగినట్లు బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నాటికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మరింత పెరిగి వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.330 పెరిగి రూ.1,62,330కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.300 పెరిగి రూ.1,48,800గా నమోదైంది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్న సమయంలో బంగారం ధరలు వరుసగా పెరగడం కొనుగోలుదారులపై అదనపు భారం మోపుతోంది. మరోవైపు వెండి ధర కూడా స్వల్పంగా పెరిగి హైదరాబాద్‌లో కిలో రూ.3,20,100కు చేరుకుంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,64,180కు చేరగా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,50,500గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,62,330గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,48,800 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,62,260గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,950గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత, అమెరికా ఆర్థిక విధానాలపై ఉన్న ఆందోళనలు, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడం వంటి కారణాలతో బంగారం ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. డాలర్ మారకం విలువల్లో మార్పులు, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు కూడా పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అయితే వెండి ధరల్లో మాత్రం కొన్ని ప్రాంతాల్లో తగ్గుదల కనిపిస్తోంది. దేశంలోని పలు నగరాల్లో కిలో వెండి ధర దాదాపు రూ.10 వేల వరకు తగ్గినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. చెన్నైలో ప్రస్తుతం కిలో వెండి రూ.3.15 లక్షల వద్ద ఉండగా, ఇతర నగరాల్లో రూ.3 లక్షల వరకు నమోదవుతోంది. బంగారం ధరలు వరుసగా పెరుగుతుండటంతో సాధారణ కొనుగోలుదారులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాల్సిన కుటుంబాలు ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు పెట్టుబడిదారులు మాత్రం పసిడిని భద్రమైన పెట్టుబడిగా భావిస్తూ కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో వీఐ 5జీ సేవలు ప్రారంభం

**హైదరాబాద్, మే 14:** దేశీయ టెలికాం రంగంలో ఐదు జీ సేవల విస్తరణ వేగంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా హైదరాబాద్ నగరంలో అధికారికంగా ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ, ఇప్పుడు తెలంగాణ రాజధానిలో కూడా ఈ సాంకేతిక సేవలను విస్తరించింది. దేశంలో డేటా వినియోగం అత్యధికంగా ఉన్న ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తోందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు మరింత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు నగరంలో ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించాయి. ముఖ్యంగా వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ సేవలకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఐదు జీ సేవల విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అనేక టెలికాం టవర్లను ఆధునీకరించినట్లు సంస్థ తెలిపింది. ఆధునిక నెట్‌వర్క్ సాంకేతికతను ఉపయోగించి వినియోగదారులకు అధిక వేగంతో పాటు మెరుగైన కనెక్టివిటీ అందించేలా చర్యలు చేపట్టినట్లు వివరించింది. నగరంలోని కీలక ప్రాంతాల్లో ఇప్పటికే నెట్‌వర్క్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఐదు జీ సాంకేతికత ద్వారా వినియోగదారులు అధిక వేగంతో డౌన్‌లోడ్లు, తక్కువ ఆలస్యంతో వీడియో కాల్స్, మెరుగైన డిజిటల్ సేవలను పొందగలరని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, స్టార్టప్ సంస్థలు, డిజిటల్ సేవల రంగానికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో ఐదు జీ విస్తరణకు ప్రాధాన్యం పెరిగింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు టెలికాం సంస్థలు ఐదు జీ సేవలను విస్తరిస్తుండగా, ఇప్పుడు వొడాఫోన్ ఐడియా కూడా తన నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేస్తోంది. రాబోయే నెలల్లో మరిన్ని నగరాల్లో కూడా ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.




# జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ

**ముంబై, మే 14:** దేశీయ డిజిటల్ రంగంలో కీలక స్థానాన్ని సంపాదించిన జియో ప్లాట్‌ఫామ్స్ సంస్థకు కొత్త నాయకత్వం లభించింది. రిలయన్స్ గ్రూప్ వారసుడిగా గుర్తింపు పొందిన ఆకాశ్ అంబానీను జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకం ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. వచ్చే ఐదేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నట్లు పేర్కొంది. రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ త్వరలో షేర్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న వేళ ఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. సంస్థ ప్రారంభ ప్రజా వాటాల విక్రయం కోసం ముసాయిదా పత్రాలను ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో మార్కెట్ నియంత్రణ సంస్థకు సమర్పించే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థ భవిష్యత్ వ్యూహాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆకాశ్ అంబానీకి కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆకాశ్ అంబానీ ఇప్పటికే జియో టెలికాం సేవల విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2014 అక్టోబర్ నుంచి రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్న ఆయన, 2022లో సంస్థ ఛైర్మన్‌గా



బాధ్యతలు స్వీకరించారు. యువ నాయకుడిగా టెక్నాలజీ రంగంపై మంచి పట్టు కలిగిన ఆకాశ్, జియో విస్తరణలో ప్రధాన పాత్ర పోషించిన వారిలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆకాశ్ అంబానీ నాయకత్వంలో జియో టెలికాం రంగంలో సంచలన వృద్ధిని నమోదు చేసింది. 2016లో ప్రారంభమైన కొద్ది నెలల్లోనే కోట్లాది వినియోగదారులను ఆకర్షించి దేశీయ టెలికాం రంగంలో భారీ మార్పులకు కారణమైంది. కేవలం ఆరు నెలల్లోనే 10 కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుని కొత్త రికార్డు సృష్టించింది. తక్కువ ధరల డేటా సేవలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ విస్తరణ ద్వారా జియో దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించింది. ఇటీవల విడుదల చేసిన ఆర్థిక గణాంకాల ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ భారీ ఆదాయాలు నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని, దాదాపు రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. డిజిటల్ సేవలు, మొబైల్ కమ్యూనికేషన్, వినోదం, ఆన్‌లైన్ సేవల రంగాల్లో జియో విస్తరణ కొనసాగుతున్న నేపథ్యంలో సంస్థ భవిష్యత్‌పై పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఆకాశ్ అంబానీ నాయకత్వం రావడం ద్వారా డిజిటల్ రంగంలో సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, వినోద రంగాల్లో సంస్థ మరిన్ని విస్తరణ ప్రణాళికలను అమలు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

# బ్యాంకుల్లో ఐదు రోజుల పనిదినాలపై మళ్లీ డిమాండ్

**న్యూఢిల్లీ, మే 14:** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పనిదినాల అమలుపై మరోసారి చర్చ ప్రారంభమైంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా చేస్తున్న ఈ డిమాండ్‌ను మళ్లీ కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాయి. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు ప్రధాని నరేంద్ర మోదీకు లేఖ రాశాయి. దేశవ్యాప్తంగా బ్యాంకు అధికారులను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది. ఐదు రోజుల పనిదినాల అమలు కేవలం ఉద్యోగుల సేవా నిబంధనలకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇది ఇంధన పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, శక్తి వినియోగ తగ్గింపు, కార్యనిర్వహణ సామర్థ్యం వంటి అనేక ప్రయోజనాలకు దోహదపడుతుందని సంఘం పేర్కొంది. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు భారీ పని ఒత్తిడిలో పనిచేస్తున్నారని సంఘం వెల్లడించింది. శాఖల నిర్వహణ, నగదు లావాదేవీలు, వినియోగదారుల సేవలు, రుణ వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణ ఆర్థిక సేవల విస్తరణ




వంటి బాధ్యతల కారణంగా ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేస్తే ఉద్యోగుల సామర్థ్యం మరింత మెరుగవుతుందని అభిప్రాయపడింది. అలాగే ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది బ్యాంకు ఉద్యోగుల ప్రయాణ భారం తగ్గుతుందని సంఘం పేర్కొంది. ఒక రోజు అదనపు సెలవు కారణంగా పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గడంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని వివరించింది. విద్యుత్ వినియోగం, కార్యాలయ నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపింది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఐదు రోజుల పని విధానం అమలులో ఉందని, బ్యాంకింగ్ రంగంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరించిన నేపథ్యంలో శాఖలకు ప్రత్యక్షంగా వచ్చే వినియోగదారుల సంఖ్య కూడా గతంతో పోలిస్తే తగ్గిందని పేర్కొంటున్నాయి. ఇక బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానం అమలుపై గతంలో కూడా పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. కేంద్ర ఆర్థిక శాఖ, భారతీయ బ్యాంకుల సంఘం, ఉద్యోగ సంఘాల మధ్య ఈ అంశంపై గతంలో చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పాల ధరలు పెంపు.. సామాన్యులకు మరో భారం

**న్యూఢిల్లీ, మే 14:** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రముఖ డైరీ సంస్థలు మరో షాక్ ఇచ్చాయి. దేశీయ ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ అమూల్ పాలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. అమూల్ బ్రాండ్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ అన్ని రకాల పాల ప్యాకెట్లపై లీటరుకు రెండు రూపాయల చొప్పున ధరలు పెంచింది. ఈ కొత్త ధరలు మే 14 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ధరల పెంపుతో అరలీటర్ అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ శక్తి పాల ప్యాకెట్ల ధర ఒక్కో రూపాయి మేర పెరిగింది. లీటర్ అమూల్ గోల్డ్ పాలు ధర 68 రూపాయల నుంచి 70 రూపాయలకు చేరగా, అమూల్ తాజా ధర 55 రూపాయల నుంచి 57 రూపాయలకు పెరిగింది. అమూల్ బాటలోనే మరో ప్రముఖ డైరీ సంస్థ మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఢిల్లీ పరిసర ప్రాంతాలు, ఇతర నగరాల్లో లీటర్ పాలపై రెండు రూపాయల వరకు పెంపు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. గేదె పాలు ధర లీటరుకు 75 రూపాయల నుంచి 80 రూపాయలకు పెరగగా, ఫుల్ క్రీమ్ పాలు ధర 69 రూపాయల నుంచి 72




రూపాయలకు చేరుకుంది. పాల ధరల పెంపుకు అనేక కారణాలు ఉన్నాయని డైరీ సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పశువుల దాణా ధరలు భారీగా పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంటున్నాయి. గడ్డి, తవుడు, ఇతర పశు ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిందని సంస్థలు వెల్లడించాయి. అదేవిధంగా రవాణా ఖర్చులు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో గ్రామాల నుంచి నగరాలకు పాలను తరలించే వ్యయం అధికమైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వేసవి కాలంలో సాధారణంగా పాల దిగుబడి తగ్గడం వల్ల సరఫరాపై ఒత్తిడి పెరిగిందని, దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ప్యాకేజింగ్ ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, శీతలీకరణ నిర్వహణ వ్యయాలు పెరగడం కూడా ధరల పెంపుకు కారణమయ్యాయి. ఈ అదనపు భారం చివరకు వినియోగదారులపైనే పడుతోందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కూరగాయలు, వంటనూనెలు, గ్యాస్, ధాన్యాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇప్పుడు పాల ధరలు కూడా పెరగడంతో సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై మరింత భారం పడనుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న కుటుంబాలు, హోటళ్లు, టీ దుకాణాలు, స్వీట్లు తయారీదారులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ధరల పెరుగుదల నేపథ్యంలో కొంతమంది వినియోగదారులు స్థానిక డైరీ కేంద్రాలు, ప్రభుత్వ పాల సరఫరా సంస్థల వైపు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో విజయ డెయిరీ వంటి ప్రభుత్వ పాల కేంద్రాల వద్ద ధరలు కొంత వరకు నియంత్రణలో ఉండే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# హర్మూజ్ మార్గం దాటిన భారత్ ఇంధన నౌకలు

**న్యూఢిల్లీ, మే 14 :** అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత్‌కు వంటగ్యాస్ సరఫరాలో కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు ఎల్‌పీజీ తీసుకువస్తున్న రెండు నౌకలు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. దీంతో ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ సముద్ర మార్గంలో సరఫరాలు మళ్లీ క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం 'సిమి' పేరుతో ప్రయాణిస్తున్న ఎల్‌పీజీ నౌక గురువారం ఒమన్ గల్ఫ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ పోర్టు నుంచి బయలుదేరిన ఈ నౌక గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తోంది. ప్రయాణ సమయంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నౌక తన ట్రాన్స్‌పాండర్ సంకేతాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అంతర్జాతీయ నౌకాశ్రయ వర్గాలు తెలిపాయి. ఇక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని రువాయిస్ రిఫైనరీ నుంచి బయలుదేరిన 'ఎన్వీ సన్‌షైన్' అనే మరో వంటగ్యాస్ నౌక కూడా హర్మూజ్ జలసంధిని దాటి భారత జలాల దిశగా ప్రయాణిస్తోంది. ఈ నౌక కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకోనున్నట్లు సమాచారం. ఈ నౌక కూడా జలసంధి దాటిన అనంతరం తన సిగ్నల్ వ్యవస్థను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ప్రపంచ ముడిచమురు, ద్రవీభవించిన సహజ వాయువు రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. మధ్యప్రాచ్య దేశాల నుంచి ఆసియా దేశాలకు వెళ్లే ఇంధన సరఫరాలో పెద్ద భాగం ఈ సముద్ర మార్గం ద్వారానే సాగుతుంది. భారత్‌కు అవసరమైన



ముడిచమురు, వంటగ్యాస్ సరఫరాలో కూడా ఈ మార్గం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. అందువల్ల ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారి ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుంది. ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ చర్చలు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ఒప్పందంపై ఇరాన్ స్పందన పూర్తిగా సంతృప్తికరంగా లేదని ఆయన తన సామాజిక మాధ్యమ వేదికలో పేర్కొన్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ తమ అభిప్రాయాన్ని అమెరికాకు పంపినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా భారత్‌కు ఇంధన నౌకలు సురక్షితంగా చేరుతుండటం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ముఖ్యంగా వంటగ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఉండటం దేశీయ మార్కెట్‌కు కీలకంగా మారింది. పరిస్థితులను భారత్ నిశితంగా గమనిస్తోందని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఇంధన సరఫరా మార్గాలపై కూడా దృష్టి పెట్టే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## కోహ్లీ క్యాచ్ మిస్ చేయడమే మ్యాచ్ మలుపు: అజింక్య రహానే

**రాయ్‌పూర్, మే 14 :** ఐపీఎల్ 2026లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన కీలక పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయం సాధించింది. ఈ ఓటమితో కోల్‌కతా నైట్ రైడర్స్ ప్లేఆఫ్స్ ఆశలకు భారీ దెబ్బ తగిలింది. మ్యాచ్ అనంతరం కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే తమ జట్టు ఓటమికి ప్రధాన కారణం ఫీల్డింగ్ వైఫల్యమేనని అంగీకరించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ బ్యాటర్ అంగ్క్రిష్ రఘువంశీ 46 బంతుల్లో 71 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, మూడు భారీ సిక్సర్లు ఉన్నాయి. చివర్లో రింకూ సింగ్ వేగంగా ఆడుతూ 29 బంతుల్లో అజేయంగా 49 పరుగులు చేసి స్కోరును మరింత పెంచాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, రసిఖ్ సలాం దార్ తలా ఒక వికెట్ తీశారు. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్‌తో విజయాన్ని అందించాడు. కోహ్లీ కేవలం 60 బంతుల్లోనే 105 పరుగులతో అజేయ శతకం సాధించి మ్యాచ్‌ను ఒంటిచేత్తో ముగించాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. అతనికి ఇతర బ్యాటర్లు కూడా సహకరించడంతో బెంగళూరు జట్టు 19.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేధించింది. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడిన అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశారు. "మా ఓటమికి ప్రధాన కారణం బ్యాటింగ్ కాదు.. ఫీల్డింగ్‌లో చేసిన పొరపాట్లే. విరాట్ కోహ్లీ క్యాచ్‌ను కీలక సమయంలో వదిలేయడం మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది" అని తెలిపారు. "కోహ్లీ లాంటి ఆటగాడికి అవకాశం ఇస్తే అతను మ్యాచ్‌ను పూర్తిగా మార్చేస్తాడు. కొత్తగా క్రీజులోకి వచ్చే బ్యాటర్‌కు ఈ పిచ్‌పై ఆడటం అంత సులభం కాదు. ఆ సమయంలో కోహ్లీని ఔట్ చేసి ఉంటే మ్యాచ్ పరిస్థితి వేరేలా ఉండేది" అని రహానే విశ్లేషించారు. గత కొన్ని మ్యాచ్‌లలో తమ జట్టు ఫీల్డింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిందని, కానీ ఇంత కీలకమైన మ్యాచ్‌లో సులభ క్యాచ్‌లు చేజార్చడం బాధాకరమని అన్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఇలాంటి చిన్న తప్పిదాలే పెద్ద మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి తీసుకొస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కోహ్లీ శతకంపై అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కీలక మ్యాచ్‌లో ఒత్తిడిని జయిస్తూ జట్టుకు విజయం అందించాడని కొనియాడుతున్నారు. ఈ విజయంతో బెంగళూరు జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత బలపరుచుకోగా, కోల్‌కతా జట్టుకు మిగిలిన మ్యాచ్‌లు 'చావో రేవో'గా మారాయి.

## ముంబై ఇండియన్స్‌లో కలకలం

### బుమ్రా కెప్టెన్‌గా కొత్త రికార్డా?

ముంబై, మే 14 : ఈసారి ఐపీఎల్‌లో పూర్తిగా నిరాశపరిచిన ముంబై ఇండియన్స్ జట్టులో ఇప్పుడు కెప్టెన్సీ మార్పులు హాట్ టాపిక్‌గా మారాయి. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే తప్పుకున్న ముంబై.. మిగిలిన మ్యాచ్‌ల్లో పరువు కాపాడుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్‌తో ధర్మశాలలో జరగనున్న మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. తాత్కాలిక సారథిగా వ్యవహరిస్తున్న సూర్యకుమార్ యాదవ్ కూడా జట్టుతో కనిపించకపోవడంతో ఇప్పుడు జట్టు పగ్గాలు జస్ప్రీత్ బుమ్రాకు అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలా జరిగితే ఒకే సీజన్‌లో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లతో ఆడిన జట్టుగా ముంబై ఇండియన్స్ అరుదైన రికార్డు సృష్టించనుంది. ఇప్పటికే హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించగా.. ఇప్పుడు బుమ్రా మూడో కెప్టెన్‌గా మారే అవకాశముంది. సీనియర్ ఆటగాడిగా జట్టులో ఎంతో అనుభవం ఉన్న బుమ్రాపై యాజమాన్యం, కోచ్‌లు నమ్మకం ఉంచినట్లు సమాచారం. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ఏదీ కలిసి రాలేదు. స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ జట్టు వరుస పరాజయాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా కెప్టెన్ హార్దిక్ పాండ్యా వ్యూహాలు, అతడి వ్యక్తిగత ఫామ్ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాయి. ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం 146 పరుగులు మాత్రమే చేసిన పాండ్యా.. బౌలింగ్‌లో కూడా నాలుగు వికెట్లతోనే సరిపెట్టుకున్నాడు. దీంతో వచ్చే సీజన్‌కు అతడిని జట్టు కొనసాగిస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బుమ్రాకు పూర్తి స్థాయి కెప్టెన్సీ ఇస్తే జట్టులో కొత్త ఉత్సాహం రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పదమూడు ఏళ్లుగా ముంబై జట్టుకు సేవలందిస్తున్న బుమ్రాకు డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి గౌరవం ఉందని, జట్టును సమర్థంగా నడిపించే సామర్థ్యం కూడా ఉందని చెబుతున్నారు. రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాడు జట్టులో ఉన్నప్పటికీ భవిష్యత్ దృష్ట్యా బుమ్రాకే అవకాశం ఇవ్వొచ్చనే చర్చ సాగుతోంది. మొత్తంగా చూస్తే ముంబై ఇండియన్స్‌కు ఈ సీజన్ పూర్తిగా చేదు అనుభవంగా మారింది. ఇప్పుడు మిగిలిన మ్యాచ్‌ల్లో జట్టు ఎలా రాణిస్తుంది? బుమ్రా నిజంగానే కెప్టెన్ అవుతాడా? హార్దిక్ పాండ్యా భవిష్యత్‌పై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.



# తిలక్ వర్మ మెరుపులు!

ఆఖరి ఓవర్లో ఉత్కంఠ గెలుపు..

ముంబై ఇండియన్స్ అద్భుత ఛేదన

పంజాబ్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం..

వృథా అయిన ప్రభ్ సిమ్రన్ పోరాటం



**ధర్మశాల :** ఐ పీ ఎల్ లో భాగంగా హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ పీ సీ ఏ) స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ (పీ బీ కే ఎస్) పై ముంబై ఇండియన్స్ (ఎం ఐ) అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ రసవత్తర పోరులో ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేగగా.. ముంబై 6 వికెట్ల తేడాతో పంజాబ్ ను చిత్తు చేసింది. యువ కెప్టెన్ తిలక్ వర్మ విధ్వంసక అర్ధశతకంతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 19.5 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 205 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో కదంతొక్కగా.. ర్యాన్ రికెల్టన్, విల్ జాక్స్ రాణించారు. బౌలింగ్ లో శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లతో పంజాబ్ పతనాన్ని శాసించాడు.

### ప్రభ్ సిమ్రన్, అజ్మతుల్లా దూకుడు..

టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. మంచు ప్రభావం (డ్యూ ఫ్యాక్టర్) ఉంటుందనే అంచనాలతో చేజింగ్ కు మొగ్గుచూపాడు. అయితే మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ కు ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుని మైదానం నలువైపులా భారీ సిక్సర్లు బాదాడు. కేవలం 32 బంతుల్లోనే 57 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ సైతం బ్యాట్ ఝుళిపించాడు. 17 బంతుల్లోనే 38 పరుగులు సాధించి స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో ప్రియాంశ్ ఆర్య 17 బంతుల్లో 22 పరుగులు చేయడంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 39 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి పంజాబ్ భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. దీపక్ చాహర్ 36 పరుగులిచ్చి 2 వికెట్లు, రాజ్ బావా 11 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు.

### కెప్టెన్ ఇన్నింగ్స్ తో ముంబై జయభేరి..

201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ కు ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ మెరుగైన ఆరంభాన్నిచ్చాడు. 23 బంతుల్లోనే 48 పరుగులు సాధించి జట్టును రేసులో నిలిపాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ బౌండరీల వర్షం కురిపించాడు. బాధ్యతాయుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ కేవలం 33 బంతుల్లోనే అజేయంగా 75 పరుగులు బాది మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ కేవలం 10 బంతుల్లోనే అజేయంగా 25 పరుగులు సాధించి ఫినిషర్ పాత్ర పోషించాడు. దీంతో ముంబై మరో బంతి మిగిలి ఉండగానే (19.5 ఓవర్లలో) 205 పరుగులు చేసి జయభేరి మోగించింది. పంజాబ్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 36 పరుగులిచ్చి 2 వికెట్లు, యుజ్వేంద్ర చాహల్ 32 పరుగులిచ్చి 1 వికెట్, మార్కో జాన్సెన్ 55 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టినా లాభం లేకపోయింది.

### పట్టికలో పంజాబ్, ముంబైల పరిస్థితి..

ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల ఖాతాను మెరుగుపరుచుకుంది. అయితే టోర్నీలో ఆరంభం నుంచే తడబడిన ముంబై (మొత్తం 12 మ్యాచ్ ల్లో 4 విజయాలు, 8 పరాజయాలతో 8 పాయింట్లు) ప్లే ఆఫ్స్ రేసులో వెనుకబడి పట్టికలో కిందిస్థాయిలోనే కొనసాగుతోంది. మరోవైపు ఈ మ్యాచ్ లో పోరాడి ఓడిన పంజాబ్ కింగ్స్ (మొత్తం 12 మ్యాచ్ ల్లో 6 విజయాలు, 6 పరాజయాలతో 12 పాయింట్లు) పట్టికలో నాలుగో స్థానంలో ఉంటూ ప్లే ఆఫ్స్ అవకాశాలను క్లిష్టమయం చేసుకుంది. తర్వాత జరిగే మ్యాచ్ ల్లో భారీ విజయాలు సాధిస్తే తప్ప పంజాబ్ ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. లీగ్ దశ ఆఖరి ఘట్టానికి చేరుకోవడంతో ప్రతి మ్యాచ్ టోర్నీ భవితవ్యాన్ని శాసిస్తోంది

## ఐపీఎల్‌లో కెప్టెన్లపై వేటు?

### అక్షర్, పంత్, రహానే భవితవ్యంపై సందేహాలు

**ముంబై, మే 14:** ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ పలు ఫ్రాంచైజీల్లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా వరుస వైఫల్యాలతో ప్లేఆఫ్స్‌కు జట్లను చేర్చడంలో విఫలమైన ముగ్గురు కెప్టెన్ల భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తదుపరి సీజన్‌లో కెప్టెన్లుగా కొనసాగుతారా లేదా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించగా, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కూడా దాదాపుగా అవకాశాలు కోల్పోయాయి. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యాలు సీరియస్‌గా సమీక్షలు ప్రారంభించినట్లు సమాచారం. ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహించిన అక్షర్ పటేల్ ఈ సీజన్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. తొమ్మిది ఇన్నింగ్స్‌లలో కేవలం 100 పరుగులు మాత్రమే చేసి తీవ్ర నిరాశ పరిచాడు. అందులో ఒకే ఇన్నింగ్స్‌లో చేసిన 56 పరుగులు మినహా మిగిలిన మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. బౌలింగ్‌లో 12 మ్యాచ్‌లలో 10 వికెట్లు తీసినా, కీలక సమయాల్లో తాను స్వయంగా బౌలింగ్‌కు రావడంలో వెనుకంజ వేసిన తీరు విమర్శలకు దారితీసింది. కెప్టెన్‌గా వ్యూహాత్మక నిర్ణయాల్లో కూడా అక్షర్ బలహీనంగా కనిపించాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా యువ ఆటగాళ్ల వినియోగంలో చేసిన తప్పిదాలు ఢిల్లీ జట్టుకు భారీ నష్టంగా మారాయి. ప్రతిభావంతుడైన అభిషేక్ పోరెల్కు సరైన అవకాశాలు ఇవ్వకపోవడం, ఆల్‌రౌండర్ మాధవ్ తివారీను సరిగా ఉపయోగించుకోకపోవడం యాజమాన్యాన్ని అసంతృప్తికి గురి చేసినట్లు తెలుస్తోంది. ఇక రిషభ్ పంత్ పరిస్థితి కూడా అంతే క్లిష్టంగా మారింది. భారీ మొత్తానికి లక్నో జట్టులో చేరిన పంత్ నుంచి అభిమానులు, యాజమాన్యం పెద్ద అంచనాలు పెట్టుకున్నాయి. కానీ ఈ సీజన్‌లో అతని ప్రదర్శన తీవ్ర నిరాశ కలిగించింది. 11మ్యాచ్‌లలో కేవలం 251 పరుగులు మాత్రమే చేసిన పంత్, తన సహజమైన దూకుడు ఆటను పూర్తిగా కోల్పోయినట్లు కనిపించాడు. కేవలం తొమ్మిది సిక్సర్లు మాత్రమే కొట్టడం అతని ఫామ్ ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. కెప్టెన్సీ ఒత్తిడి అతని ఆటపై స్పష్టంగా ప్రభావం చూపిందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జట్టు ఎంపికలోనూ పలు తప్పిదాలు చోటుచేసుకున్నాయి. యువ ఆటగాడు అర్షిన్ కులకర్ణిను ఓపెనర్‌గా పంపడం, దేశవాళీ క్రికెట్‌లో సాధారణ రికార్డులు మాత్రమే ఉన్న హిమ్మత్ సింగ్కు వరుస అవకాశాలు ఇవ్వడం వంటి నిర్ణయాలు విమర్శలకు గురయ్యాయి. అలాగే ఆయుష్ బదోనిను టాప్ ఆర్డర్‌లో ప్రయోగించడం కూడా ఫలితం ఇవ్వలేదు. జట్టులో నికోలస్ పూరన్, ఏడెన్ మార్క్‌రమ్ వంటి స్టార్ ఆటగాళ్లు ఫామ్ కోల్పోవడం కూడా లక్నో వైఫల్యానికి కారణమైంది. మరోవైపు కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానేపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంప్రదాయ టెస్ట్ బ్యాటింగ్ శైలితో పేరొందిన రహానే టీ20 ఫార్మాట్‌కు అవసరమైన వేగాన్ని అందుకోలేకపోతున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో 237 పరుగులు చేసిన రహానే స్ట్రైక్ రేట్ కేవలం 133 మాత్రమే. టాప్ ఆర్డర్‌లో అతని నిదానమైన ఆట కారణంగా జట్టు పలుమార్లు ఒత్తిడిలో పడింది. యువ ఆటగాడు అంగ్క్రిష్ రఘువంశీ కూడా వేగంగా పరుగులు చేయడంలో విఫలమవడంతో కేకేఆర్ బ్యాటింగ్ దెబ్బతింది. 11 మ్యాచ్‌లలో ఈ ఇద్దరూ కలిసి కేవలం 25 సిక్సర్లు మాత్రమే కొట్టడం జట్టు దూకుడు ఎంత తక్కువగా ఉందో చూపిస్తోంది. టీ20ల్లో వేగవంతమైన బ్యాటింగ్ అత్యవసరమైన సమయంలో రహానే పాత శైలిలోనే కొనసాగడం అభిమానులను నిరాశపరుస్తోంది. ఇటీవల తన స్ట్రైక్ రేట్‌పై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ "అసూయతో మాట్లాడుతున్నారు" అని రహానే చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. అయితే ప్రస్తుతం ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. క్రికెట్ వర్గాల అంచనాల ప్రకారం అక్షర్, పంత్‌లకు ఆటగాళ్లుగా ఇంకా మంచి డిమాండ్ ఉన్నప్పటికీ కెప్టెన్లుగా కొనసాగడం కష్టమేనని భావిస్తున్నారు. మరోవైపు రహానే భవిష్యత్తు మరింత అనిశ్చితంగా కనిపిస్తోంది. వచ్చే మినీ వేలంలో ఆయనపై ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతాయా లేదా అన్నది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.





# కామెడీ షోల వల్గారిటీపై బిందు మాధవి వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 14:** తెలుగు టెలివిజన్‌లో కామెడీ కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా ప్రసారమవుతున్న కామెడీ షోలు ప్రేక్షకులను అలరిస్తూనే అనేక మంది కమెడియన్స్, యాంకర్లు, నటులకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే ఈ షోలపై డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గారిటీ జోక్స్, కుటుంబంతో కలిసి చూడలేని కొన్ని స్కిట్స్ ఉన్నాయనే విమర్శలు కూడా తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఇదే అంశంపై హీరోయిన్, బిగ్‌బాస్ ఫేమ్ బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు తెలుగు టెలివిజన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం బిందు మాధవి కొత్తగా ప్రారంభమైన 'మాస్ జాతర' కామెడీ షోలో జడ్జిగా వ్యవహరిస్తోంది. ఈ షో కూడా స్కిట్స్, వినోదాత్మక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే ఇతర కామెడీ షోల మాదిరిగా కాకుండా కుటుంబమంతా కలిసి చూసేలా క్లీన్ కామెడీ అందించడమే తమ లక్ష్యమని షో నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న బిందు మాధవి కామెడీ షోలలో పెరుగుతున్న వల్గారిటీపై స్పందించింది. "మాస్ జాతర పూర్తిగా వినోదంతో నిండిన కార్యక్రమం. మొదట నన్ను జడ్జిగా చేయమని అడిగినప్పుడు వెంటనే అంగీకరించలేదు. ఎందుకంటే ఈ మధ్య చాలా కామెడీ షోలలో డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గర్ కామెడీ ఎక్కువైపోయిందనే భావన కలిగింది. అలాంటి కార్యక్రమాలను చూసి కొంత అసహనం కూడా కలిగేది" అని చెప్పింది. తర్వాత షో దర్శకుడు ప్రత్యేకంగా వచ్చి ఈ కార్యక్రమం గురించి వివరించారని బిందు మాధవి తెలిపింది. "మా షోలో ఎలాంటి వల్గారిటీ ఉండదు. ఎక్కడైనా అసభ్యకరమైన డైలాగ్స్ ఉంటే మీరు మధ్యలోనే షో నుంచి వెళ్లిపోవచ్చు అని నాతో చెప్పారు. కుటుంబమంతా కలిసి కూర్చొని చూసేలా కార్యక్రమాన్ని రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అందుకే నేను ఈ షో చేయడానికి అంగీకరించాను" అని వివరించింది. ఇప్పటికే 28 ఎపిసోడ్లు పూర్తయ్యాయని, ఇప్పటివరకు ఒక్కసారి కూడా అసౌకర్యంగా అనిపించలేదని ఆమె చెప్పింది. "తెలుగులో కూడా వల్గారిటీ లేకుండా మంచి కామెడీ చేయవచ్చని మా షో నిరూపిస్తోంది. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని వినోదాన్ని అందించడం చాలా ముఖ్యం. ఈ కార్యక్రమంలో భాగమవ్వడం నాకు గర్వంగా ఉంది" అంటూ బిందు మాధవి వ్యాఖ్యానించింది. ఆమె వ్యాఖ్యలు బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. బిందు మాధవి నేరుగా ఏ షో పేరు ప్రస్తావించకపోయినా, చాలా మంది నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలను ప్రముఖ కామెడీ షోలపై పరోక్ష విమర్శలుగా భావిస్తున్నారు. ముఖ్యంగా డబుల్ మీనింగ్ కామెడీపై గతంలో వచ్చిన విమర్శలను మరోసారి నెటిజన్లు ప్రస్తావిస్తున్నారు. తెలుగు టెలివిజన్‌లో కామెడీ షోల పరిణామంపై కూడా ఈ వ్యాఖ్యలతో చర్చ మొదలైంది. ఒకప్పుడు కుటుంబమంతా కలిసి చూసే వినోద కార్యక్రమాలుగా గుర్తింపు పొందిన షోలు, క్రమంగా ట్రెండ్ పేరుతో వల్గారిటీ వైపు వెళ్లాయని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నాయని, అందుకే షోలు కూడా మారాల్సి వస్తోందని మరికొందరు అంటున్నారు. ఇటీవల కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించే కార్యక్రమాలకు మళ్లీ ఆదరణ పెరుగుతోందని టెలివిజన్ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల పోటీ పెరిగిన నేపథ్యంలో టీవీ షోలు కుటుంబ ప్రేక్షకులను నిలబెట్టుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు తెలుగు కామెడీ షోలలో వల్గారిటీ అంశాన్ని మరోసారి చర్చకు తెచ్చాయి. భవిష్యత్తులో వినోద కార్యక్రమాలు ఎటువైపు సాగుతాయో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. 'ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం' అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# శోభిత సరదా కామెంట్ వైరల్





**హైదరాబాద్, మే 14:** అక్కినేని హీరో నాగచైతన్య, నటి శోభిత ధూళిపాళ జంట ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కడ కనిపించినా అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటోంది. తాజాగా విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ఈ జంట ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో జరిగిన చిన్న సరదా సంభాషణ కారణంగా మరోసారి వార్తల్లో నిలిచింది. నిన్న అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న నాగచైతన్య, శోభితలను చూసేందుకు అభిమానులతో పాటు మీడియా ప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్నారనే సమాచారం అందిన వెంటనే ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అక్కడికి చేరుకోవడం సాధారణమే. ఈ క్రమంలో చై-శోభిత జంట బయటకు వస్తుండగా కెమెరాలు వరుసగా క్లిక్‌మనిపించాయి. నాగచైతన్యతో కలిసి ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న శోభిత ధూళిపాళ, అర్ధరాత్రి అయినా మీడియా అక్కడే ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే చిరునవ్వుతో మీడియా ప్రతినిధుల వైపు చూస్తూ.. "మీరు అస్సలు నిద్రపోరా?" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన తీరు అక్కడున్న వారిని ఒక్కసారిగా నవ్వుల్లో ముంచెత్తింది. శోభిత వ్యాఖ్య విన్న నాగచైతన్య కూడా చిరునవ్వు చిందించడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. అనంతరం అభిమానులకు చేతులు ఊపుతూ ఈ జంట అక్కడి నుంచి కారులో వెళ్లిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "శోభిత చాలా సహజంగా మాట్లాడింది", "మీడియా కష్టాన్ని సరదాగా గుర్తుచేసింది", "చై-శోభిత జంట చాలా క్యూట్‌గా ఉంది" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు ఈ జంట సింప్లిసిటీని ప్రశంసిస్తుండగా, మరికొందరు వీరిద్దరి అన్యోన్యత ఆకట్టుకుంటోందని అభిప్రాయపడుతున్నారు. తెనాలికి చెందిన శోభిత ధూళిపాళ మోడలింగ్ రంగం ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బాలీవుడ్, తెలుగు, తమిళం, మలయాళం వంటి పలు భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. తన అందం, నటన, ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో తక్కువ సమయంలోనే సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇటీవల అక్కినేని కుటుంబంతో ఆమెకు ఏర్పడిన అనుబంధం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఆమెకు మరింత క్రేజ్ పెరిగింది. ఇక నాగచైతన్య కూడా వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు. వ్యక్తిగత జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టిన తర్వాత ఆయన మరింత ప్రశాంతంగా కనిపిస్తున్నారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. తరచూ కలిసి కనిపిస్తున్న నాగచైతన్య-శోభిత జంట సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న ఈ జంటపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.




# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

## ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷-లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ-సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.



This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com